జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528


రంగారెడ్డి సోమవారం 24 ఫిబ్రవరి 2025 సంపుటి : 15 సంచిక : 176 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com





## అసెంబ్లీ సమావేశాలకు
# సర్వం సిద్ధం

- ప్రతిపక్ష హోదా కోసం వైసీపీ డిమాండ్..
- సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- అయితే ఈ సమావేశాలకు హాజరవుతున్నామని వైసీపీ ప్రకటించడంతో వాతావరణం ఆసక్తికరంగా మారింది.
- జగన్‌తో సహా ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్ష హోదాను డిమాండ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ప్రజాజ్యోతి అమరావతి**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు సర్వం సిద్ధమైంది. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం సభ మరుసటి రోజుకు వాయిదా పడుతుంది. సభ వాయిదా పడిన తర్వాత బీఏసీ సమావేశంలో ఎన్ని రోజులపాటు సమావేశాలు నిర్వహించాలి..? ఏ రోజు ఏ అంశంపై చర్చించాలి..? అనే ఎజెండాను ఖరారు చేస్తారు. మొత్తం రెండు లేదా మూడు వారాల - మిగతా3లో

## గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు
# 92 శాతం మంది హాజరు



- గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది
- పరీక్ష వాయిదా వేయాలంటూ కొన్ని రోజులుగా అభ్యర్థుల ఆందోళనలు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల వాయిదా వేయలేమని నిన్న ఏపీపీఎస్సీ స్పష్టీకరణ

**ప్రజాజ్యోతి అమరావతి**

ఏపీలో నేడు గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. రోస్టర్ విధానంలో మార్పులు చేయాలంటూ అభ్యర్థులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేపడుతున్నప్పటికీ, ఏపీపీఎస్సీ ఈ పరీక్ష నిర్వహించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున - మిగతా3లో



## బానిస మనస్తత్వాలు

- బానిస మనస్తత్వంతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు
- విదేశీ మద్దతు ఉన్నవాళ్లు మన నమ్మకాలను తప్పుబడుతున్నారు
- కుంభమేళా ఐక్యతా చిహ్నంగా భావితరాలకు స్ఫూర్తినిస్తుంది
- అంతరిక్ష రంగంలో దేశం ఏటా పురోగతి సాధిస్తోంది
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ మరింత ముందుకెళ్లాలని
- మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ప్రధాని.

## ప్రజా సేవలో తిరుగులేని
# నాయకుడు ఎర్రన్నాయుడు

- ప్రజా సేవలో తిరుగులేని నిబద్ధత, నిజాయితీ, ఆత్మీయత కలబోసిన నాయకుడు ఎర్రన్నాయుడు
- మూడు దశాబ్దాలకు మించిన రాజకీయ జీవితంలో మచ్చలేని చరిత్రను సొంతం చేసుకున్నాడు
- సోషల్ మీడియా వేదికగా ఎర్రన్నాయుడితో ఉన్న ఫొటోను షేర్ చేసిన చంద్రబాబు




**ప్రజాజ్యోతి అమరావతి**

ప్రజా సేవలో తిరుగులేని నిబద్ధత, నిజాయితీ, ఆత్మీయత కలబోసిన నాయకుడు ఎర్రన్నాయుడు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు కొనియడారు. మూడు దశాబ్దాలకు మించిన రాజకీయ జీవితంలో మచ్చలేని చరిత్రను సొంతం చేసుకున్నాడని గుర్తుచేశారు. తన ఆత్మీయ నేస్తం ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఎర్రన్నాయుడితో ఉన్న ఫొటోను చంద్రబాబు షేర్ చేశారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరచిపోని ప్రజా నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు. ప్రజా సమస్యలపై ఆయన స్పందించే విధానం, అనేక క్లిష్టమైన సమస్యలపై పోరాటం నేటి తరానికి ఆదర్శనీయమని కొనియడారు. రాష్ట్రానికి, తనని నమ్ముకున్న ప్రజలకి న్యాయం చెయ్యాలనే - మిగతా3లో



## చవకగా కేన్సర్ మందులు, దేశవ్యాప్తంగా డేకేర్ సెంటర్లు

- బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు శంకుస్థాపన
- కేన్సర్‌తో పోరాడేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో పలు ప్రకటనలు
- కేన్సర్ మందులు చవకగా దొరికేలా చూసేందుకు, మూడేళ్లలో దేశంలోని అన్ని జిల్లాల్లోనే కేన్సర్ డేకేర్ సెంటర్లు తెరిచేందుకు నిర్ణయం

## జనసేన శాసన సభా పక్ష సమావేశంలో
# కీలక నిర్ణయం

### సమావేశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, పార్టీ విధానాలపై చర్చ

**ప్రజాజ్యోతి అమరావతి**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశం మొదలైంది. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, పార్టీ విధానాలను జనసేన ఎమ్మెల్యేలకు ఈ సందర్భంగా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వివరించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వాగతోపన్యాసం- మిగతా3లో






## ఆప్ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి

- ఈ పదవికి తొలి మహిళగా రికార్డు
- ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సభ్యుల సమావేశంలో నిర్ణయం
- పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా ఆమె సేవలందించారు
- ఆరోగ్యకరమైన ప్రతిపక్షంగా ఆప్ తన బాధ్యతలను నెరవేరుస్తుంది
- ప్రజలు ఆప్‌కు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు
- బలమైన ప్రతిపక్షం ఎలా పనిచేస్తుందో తాము చూపిస్తాం

# బానిస మనస్తత్వాలు...



భోపాల్: కొన్ని శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. భారతదేశ మత, సాంస్కృతిక సంప్రదాయాలను కొన్ని శక్తులు వ్యతిరేకిస్తున్నాయని ధ్వజమెత్తారు. మహా కుంభమేళాను ఉద్దేశిస్తూ ఇటీవల ప్రతిపక్షాలు చేసిన విమర్శలపై మోదీ ఘాటుగా స్పందించారు. వారంతా బానిస మనస్తత్వం కలిగిన వారిగా అభివర్ణించారు ప్రధాని మోదీ. ఈ తరహా వ్యాఖ్యలతో దేశ ఐక్యతను దెబ్బ తీయడమే అవుతుంది కానీ దాని వల్ల కలిసొచ్చే ఏమీ లేదన్నారు. అనేక సార్లు విదేశీ శక్తులు సైతం ఈ వ్యక్తులకు మద్దతు ఇవ్వడం ద్వారా దేశాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. విశ్వాసాలు, నమ్మకాలు, ఆలయాలు, మతం, సంస్కృతితో పాటు మన పండుగలు, సంప్రదాయాలు, ఆచారాలను వీరంతా మంటగలుపుతున్నారు. దాని ఫలితంగా దేశ ఐక్యతను దెబ్బతీయడమే వారు పనిగా పెట్టుకున్నారని మోదీ మండిపడ్డారు.

ప్రధాని మోదీ మధ్యప్రదేశ్ లోని చత్తార్ పుర్లో భాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సెంటర్ సైన్స్ రీసెర్చ? సెంటర్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలను ఉద్దేశించిన మోదీ మాట్లాడారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే శక్తులతో చాలా ప్రమాదకరమన్నారు. మన దేశ సాంప్రదాయలు, సంస్కృతిలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వారు బానిస మసనస్తత్వంతో ఉంటూ దేశ ఐక్యతను దెబ్బ తీయడానికి యత్నిస్తున్నాయన్నారు.

మహా కుంభ మేళాలో తొక్కిసలాల జరిగిన నాటి నుంచి అటు కేంద్ర ప్రభుత్వంపై ఇటు యూపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి ప్రతిపక్షాలు. మహా కుంభమేళా అనేది మృత్యు కుంభ్ మేళా అని పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ వ్యాఖ్యానించగా, అఖిలేస్ యాదవ్, మల్లిఖార్జున ఖర్గే వంటి వారు సైతం తీవ్ర విమర్శలు చేశారు.

**ఇస్రో పనితీరు గర్వకారణం..**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 100వ రాకెట్ ప్రయోగం పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతరిక్ష రంగంలో దేశం ఏటా పురోగతి సాధిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఇస్రోకు ప్రధాని అభినందనలు తెలియజేశారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ప్రధాని.. ఇస్రో, ఏఐ రంగాలపై ప్రధానంగా చర్చించారు.

గతంతో పోలిస్తే ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య పెరగడం అభినందనీయమని ప్రధాని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కైలాష్ను మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. గిరిజన భాషలను పరిరక్షించడంలో ఆయన సాయం చేశారంటూ కొనియాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ను ఉపయోగించి కొలామి భాషలో కైలాష్ పాటను కంపోజ్ చేశారని ప్రధాని మోదీ అన్నారు.

# ఆప్‌లో చేరిన పంజాబీ నటి సోనియా మాన్



చండీగఢ్: పంజాబ్ నటి సోనియా మాన్ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సమక్షంలో? పార్టీలో చేరారు. సోనియా రాకను ఆప్ పంజాబ్ స్వాగతించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా.. "కీర్తి కిసాన్ యూనియన్ నాయకుడు ఎస్ బల్దేవ్ సింగ్ కుమార్తె, పంజాబీ నటి సోనియా మాన్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఆమెకు ఆమ్ ఆద్మీ కుటుంబంలోకి స్వాగతం" అంటూ ట్వీట్ చేసింది. మరో వైపు, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన ఆమ్ ఆద్మీ పార్టీలో సోనియా జాయిన్ కావడంపై చర్చ నడుస్తోంది. 1986లో ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతిలో హత్యకు గురైన రైతు కిసాన్ నాయకుడు బల్దేవ్ సింగ్ కూతురే సోనియా మాన్. ఆమె 1986, సెప్టెంబరు 10న ఉత్తర ప్రదేశ్‌లోని హల్ద్వానీలో జన్మించింది. సోనియా అమృత్‌సర్ పట్టణంలో పెరిగింది. హెూలీ హార్ట్ ప్రెసిడెన్సీ స్కూల్ నుండి స్కూల్ విద్యను, అమృత్‌సర్‌లోని బీబీకె డీఏవీ కాలేజ్ ఫర్ ఉమెన్ లో తన కళాశాల విద్యను పూర్తి చేసింది. పంజాబీతో పాటు ఇతర భాషల్లో కూడా నటించి సోనియా మాన్ యాక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. మలయాళం, హిందీ, తెలుగు, మరాఠీతో సహా వివిధ భాషలలో బహుళ చిత్రాలలో నటించింది. సోనియా మాన్ తొలి చిత్రం 'హైడ్ ఎన్' సీక్'. 2014లో హిందీలో తొలిసారిగా కహిన్ హై మేరా ప్యార్‌లో కూడా యాక్ట్ చేసింది. 2020లో వచ్చిన హ్యాపీ హార్డీ, హీర్ చిత్రాల్లోనూ నటించి ప్రశంసలు అందుకుంది. సినిమాలతో పాటు 2018లో మరణించిన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలాతో సహా ప్రసిద్ధ సింగర్లతో కలిసి పని చేసిన ఆమె.. నటిగా రాణిస్తూనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. కాగా, 2022లో జరిగిన పంజాబ్ ఎన్నికల్లో ఆప్ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సీఎం భగంత్ మాన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటైంది. మరో రెండేళ్లలో పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో కేజ్రీవాల్ పంజాబ్‌పై దృష్టి పెట్టారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో 2027లో జరగనున్న పంజాబ్‌లోనైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నాల్లో కేజ్రీవాల్ ఉన్నారు.

# కాంగ్రెస్‌తో విభేదాలపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో మరోసారి విభేదాలు తలెత్తాయా? పార్టీ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు, అధిష్టానానికి మధ్య విభేధాలు నడుస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై శశిథరూర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. 18వ శతాబ్దం నాటి ఆంగ్ల కవి థామస్ గ్రే కవితలోని పదాలను ఆయన షేర్ చేశారు. ''అజ్ఞానం ఆనందంగా ఉన్న చోట తెలివిగా ఉండటం మూర?త్వం'' అనే అర్థం వచ్చేలా ఈ కవిత సాగింది.

కాంగ్రెస్, థరూర్ మధ్య విభేదాలు ఏమిటి?

శశిథరూర్ ఇటీవల ఒక ఆర్టికల్‌లో కేరళ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. ప్రధానమంత్రి అమెరికా పర్యటనపై సైతం ప్రశంసలు కురిపించారు. వీటిపై కాంగ్రెస్ పార్టీ గుర్రుమంటోందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై థరూర్ ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ, తాను 16 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ప్రభుత్వంలో తమ పార్టీ ప్రభుత్వం ఉన్నా, ఇతర పార్టీ ప్రభుత్వం ఉన్నా మంచి పనులు చేస్తే ప్రశంసించడం, తప్పు చేస్తే నిలదీయడం తన నైజమని చెప్పారు. కేరళలోని ప్రస్తుత లెఫ్ట్ హయాంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వృద్ధి గురించి ఒక ఆర్టికల్‌లో చెప్పానే కానీ ప్రభుత్వం గురించి కాదని వివరించారు. ప్రభుత్వం చేయాల్సిందే చాలానే ఉందని అన్నారు. గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ రిపోర్డ్ 2024 ఆధారంగా వాస్తవ నిజాలు, లెక్కలను తన ఆర్టికల్‌లో ప్రస్తావించానని తెలిపారు. ఆర్టికల్ మొత్తం చదవి మాట్లాడాలే కానీ ఏదో ఒక లైను ఆధారంగా చేసుకుని కామెంట్ చేయడం సరికాదని ఆయన అన్నారు. అందులో పార్టీ రాజకీయాల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని, ఆర్థిక దివాళా నుంచి రాష్ట్రం బయటపడాల్సిన అవసరాన్ని తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో పదేపదే చెబుతూ వస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటనే విషయంలో క్లారిటీ లేకపోవడంతో శశిథరూర్ అసంతృప్తితో ఉన్నారనే వార్తలు కొద్దికాలంగా వినిపిస్తున్నాయి. పార్లమెంటులో కీలక డిబేట్‌లలో పాల్గొనే అవకాశం ఇవ్వడం లేదని, సమస్యను పరిష్కరించడంలో రాహుల్ గాంధీ విఫలమయ్యారని ఆయన అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు.

**రాహుల్‌ను కలిసిన శశిథరూర్**

కాగా, శశిథరూర్ రాసిన ఆర్టికల్‌పై కేరళ కాంగ్రెస్ యూనిట్ విమర్శలు గుప్పించిందన్న వార్తల నేపథ్యంలో రాహుల్ గాంధీని గత మంగళవారంనాడు శశిథరూర్ కలుసుకున్నారు. రాహుల్‌తో చక్కటి సంభాషణ జరిగిందని సమావేశానంతరం శశిథరూర్ తెలిపారు. సమావేశంలో ఏ అంశాలు చర్చకు వచ్చాయనే వివరాలను ఆయన దాటవేశారు. పార్టీ తనను పక్కకు పెట్టడంతో అసంతృప్తిగా ఉన్నారా అని అడిగినప్పుడు.. తాను ఎప్పుడూ ఎవరైనా ఫిర్యాదు చేయలేదని ఆయన క్లుప్తంగా సమాధానమిచ్చారు.

# చవకగా కేన్సర్ మందులు, దేశవ్యాప్తంగా డేకేర్ సెంటర్లు



చతర్పూర్: కేన్సర్ మందులను చవకగా అందుబాటులో తేవడంతో పాటు దేశంలోని అన్ని జిల్లాల్లోనూ కేన్సర్ డేకేర్ సెంటర్లు తెరవాలని కేంద్ర నిర్ణయించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని చతర్పూర్‌లో బాగేశ్వర్ థామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్ట్ ఇన్‌స్టిరేట్‌కు ప్రధాని ఆదివారంనాడు శంకస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేన్సర్‌తో పోరాడేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేశామని గుర్తుచేశారు. కేన్సర్ మందులు చవకగా దొరికేలా చూసేందుకు, మూడేళ్లలో దేశంలోని అన్ని జిల్లాల్లోనే కేన్సర్ డేకేర్ సెంటర్లు తెరిచేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

**మహాకుంభ్‌పై ప్రశంసలు**

ప్రధాని తన ప్రసంగంలో మహాకుంభ్‌ను విజయవంతం చేసేందుకు పారిశుధ్య కార్మికులు, పోలీసులు సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేశారని ప్రశంసించారు. ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన 'గ్రేట్‌కుంభ్' ఇదని అన్నారు. వేలాదిమంది వైద్యులు, వలంటీర్లు అకింతభావంతో, కేవల సేవాభావంతో పనిచేశారని అన్నారు. దేశంలోని మత, సాంస్కృతిక సంప్రదాయాలను విమర్శిస్తున్న వారిపై ప్రధాని నిశిత విమర్శలు గుప్పించారు. కొందరు నేతలు మతాన్ని పరిహసిస్తూ, ప్రజలను విడగొడుతూ, తరచు దేశాన్ని, విశ్వాసాలను బలహీనపరిచే విదేశీ శక్తులకు మద్దతు పలుకుతున్నారని అన్నారు. శతాబ్దాలుగా హిందూయిజాన్ని వ్యతిరేకించే వారు మన నమ్మకాలు, ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు చేస్తూనే ఉన్నారని అన్నారు. ప్రగతిశీలక మతాన్ని, ఐక్యతను దెబ్బతీయడమే వారి లక్ష్యంగా ఉందన్నారు. ఈ క్రమంలో దేశంలో ఐక్యతా మంత్రాన్ని జాగృతం చేసేందుకు ధీరేంద్ర శాస్త్రి విశేష కృషి చేశారని, ఆయన చొరవతో ఇప్పుడు కేన్సర్ ఇన్‌స్టిరేట్ నిర్మాణం జరుగుతోందని చెప్పారు.

**ఒక వార్డుకు ప్రధాని తల్లి పేరు**

భాగేశ్వర్ థామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని ఒక వార్డుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తి హీరాబెన్ మోదీ పేరు పెట్టనున్నట్టు ధీరేంద్ర శాస్త్రి ప్రకటించారు. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో రెండు, మూడేళ్లలో ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. నిస్సహాయులు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కేన్సర్ పేషెంట్లకు ఉచితంగా ఇక్కడ వైద్య సేవలను అందిస్తామని తెలిపారు.

## ఆప్ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి



న్యూఢిల్లీ: అసెంబ్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి పేరు ఖరారైంది. ఆదివారం మధ్యాహ్నం ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సభ్యుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ తొలి సమావేశంలో లేవనెత్తాల్సిన అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

సమావేశానంతరం ఆప్ నేత గోపాల్ రాయ్ మీడియాతో మాట్లాడుతూ, లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అతిషిని ఏకగ్రీవంగా నిర్ణయించామని, పార్టీ క్లిష్ట కాలంలో ఢిల్లీ సీఎంగా ఆమె సేవలందించారని ప్రశంసించారు. ఆరోగ్యకరమైన ప్రతిపక్షంగా ఆప్ తన బాధ్యతలను నెరవేరుస్తుందని చెప్పారు.

అతిషి మాట్లాడుతూ, ప్రజలు ఆప్‌కు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారని, బలమైన ప్రతిపక్షం ఎలా పనిచేస్తుందో తాము చూపిస్తామని తెలిపారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే మహిళలకు ఆర్థిక సాయం అంశాన్ని ఆమోదించి మార్చి 8న నాటికి వారి అకౌంట్లలో రూ.2,500 వేస్తామని మోదీ హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఈ హామీని అమలయ్యేలా చూడం తమ బాధ్యత అని అతిషి చెప్పారు. ఎన్నికలకు ముందే తాము కాగ్ నివేదికను స్పీకర్‌కు పంపామని, దానిని ఆయన ప్రెజెంట్ చేసినట్టు వాళ్లు (బీజేపీ) గందరగోళం సృష్టించారని తెలిపారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి 24న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, కొత్త స్పీకర్ ఎన్నిక ఉంటుంది. బీజేపీ నేత విజేంద్ర గుప్తాను స్పీకర్‌గా నామినేట్ చేశారు. ప్రొటెం స్పీకర్‌గా అరవింద్ సింగ్ లవ్లీని ఎల్జీ నియమించారు. 25వ తేదీన గత ఆప్ ప్రభుత్వం అవినీతి, అవకతవకలపై కాగ్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతారు.

## మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారి మధ్య ఘర్షణ



లక్నో: వీధిలో రద్దీ నేపథ్యంలో మంత్రి మేనల్లుడు, పూల వ్యాపారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రాజీపడ్డారు. అయితే వారు కొట్టుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 22న బీజేపీకి చెందిన మంత్రి సోమేంద్ర తోమర్ మేనల్లుడు నిఖిల్ తోమర్, పూల షాపులతో ఇరుకుగా ఉన్న వీధిలో మహీంద్రా స్కార్పియోను డ్రైవ్ చేశాడు. ఎదురుగా ఈ ఆటో రావడంతో వాహనాన్ని నిలిపాడు. కాగా, వాహనం వెళ్లేందుకు దారి లేకపోవడంతో అక్కడున్న ఒక పూల వ్యాపారితో నిఖిల్ వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరుగడంతో ఇది ఘర్షణకు దారి తీసింది. దీంతో నిఖిల్ ఆ వ్యాపారిని కొట్టగా అతడు ప్రతిఘటించాడు. ఆ వ్యాపారికి చెందిన మహిళ కూడా నిఖిల్‌పై తిరగబడింది. దీంతో ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ఆ తర్వాత నిఖిల్ తన వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు ఈ సంఘటన తర్వాత ఇరువర్గాల వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరస్పరం ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే కొందరు వ్యక్తుల ప్రమేయంతో వారు రాజీపడ్డారు. ఈ నేపథ్యంలో ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## నెరవేరిన ఆస్ట్రేలియా వ్యక్తి చివరి కోరిక.. భారత్‌లో మృతదేహం ఖననం



పాట్నా: ఆస్ట్రేలియాకు చెందిన వ్యక్తి చివరి కోరిక నెరవేరింది. భారతదేశం పట్ల ఎంతో ప్రేమ ఉన్న అతడు తన వీలునామాలో అంతిమ కోరికను పేర్కొన్నాడు. తన మృతదేహాన్ని భారత్‌లో ఖననం చేయాలని అభ్యర్థించాడు. 12వ సారి భారత్‌ను సందర్శించిన ఆయన అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి చివరి కోరికను అతడి భార్య నెరవేర్చింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నివసించే డోనాల్డ్ సామ్స్‌కు భారత దేశమంటే ఎంతో గౌరవం, ప్రేమ. ఆస్ట్రేలియన్ హైకమాండ్ అధికారిగా ఆయన రిటైర్డ్ అయ్యారు. సామ్స్ తండ్రి బ్రిటీష్ పాలనలో అస్సాంలో పనిచేశారు. కాగా, డోనాల్డ్ సామ్స్ భారత్‌కు వచ్చినప్పుడల్లా తన తండ్రికి నివాళిగా అస్సాంను సందర్శించేవారు. కోల్‌కతా నుంచి పాట్నాకు గంగా నదిలో బోటులో ప్రయాణించే వారు. భారత్‌తో అనుబంధం పెంచుకున్న ఆయన తన వీలునామాలో ప్రత్యేకంగా అభ్యర్థించారు. తన మృతదేహాన్ని భారత్‌లోని స్మశానవాటికలో ఖననం చేయాలని చివరి కోరికగా పేర్కొన్నారు. మరోవైపు 91 ఏళ్ల డోనాల్డ్ సామ్స్ తన భార్య ఆలిస్ సామ్స్‌తో సహా 42 మంది బృందంతో కలిసి ఇటీవల 12వ సారి భారత్‌కు వచ్చారు. యథావిధిగా అస్సాంను ఆయన సందర్శించారు. ఎప్పటి మాదిరిగానే కోల్‌కతా నుంచి పాట్నాకు గంగా నది ద్వారా క్రూయిజ్‌లో ప్రయాణించారు. అయితే ఫిబ్రవరి 21న బోటులో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించింది. దీంతో ముంగేర్‌లోని కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కాగా, డోనాల్డ్ సామ్స్ మరణం గురించి భారత యంత్రాంగం, ఆస్ట్రేలియా రాయబార కార్యాలయానికి ముంగేర్ జిల్లా అధికారులు సమాచారం ఇచ్చారు. తన భర్త వీలునామాలో పేర్కొన్న ఆయన చివరి కోరికను నెరవేర్చేందుకు సహకరించాలని భార్య ఆలిస్ సామ్స్ ఆస్ట్రేలియా ఎంబసీని అభ్యర్థించింది. అనుమతి పొందడంతో ముంగేర్ జిల్లా యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లు చేసింది. దీంతో శనివారం చురంబాలోని క్రైస్తవ స్మశానవాటికలో డోనాల్డ్ సామ్స్ మృతదేహాన్ని క్రైస్తవ ఆచారాలతో ఖననం చేశారు. జిల్లా కలెక్టర్ అవ్నిష్ కుమార్ సింగ్ ఈ విషయాన్ని ధృవీకరించారు.

# జనసేన శాసన సభా పక్ష సమావేశంలో కీలక నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

చేశారు. అనంతరం చట్టసభల్లో తన అనుభవాలను సీనియర్ ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్‌తోపాటు కందుల దుర్గేష్.. తోటి ఎమ్మెల్యేలతో పంచుకున్నారు.

బడ్జెట్ సమావేశాలు జనవరి 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు.. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపనున్నారు. ఇక 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను పిబ్రవరి 28వ తేదీన సభలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పట్టనున్నారు. అసలు అయితే ఈ బడ్జెట్‌ను మార్చి 4వ తేదీన ప్రవేశపెట్టాలని ప్రభుత్వం తొలుత భావించింది కానీ.. అనివార్య కారణాల వల్ల ఈ బడ్జెట్‌ను నాలుగు రోజుల ముందుకు జరిపింది.

మరోవైపు.. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఎమ్మెల్యేలకు శిక్షణా తరగతులు నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడితోపాటు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భావించారు. అందుకోసం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాతోపాటు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడులను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అయితే అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమం సైతం వాయిదా పడింది.

ఈ నేపథ్యంలో సభలో సభ్యులు ఎలా మసులుకోవాలనే అంశంపై పార్టీ సీనియర్లతో.. కొత్తగా ఎన్నికైన జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సోమవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారు. ఆయనతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా సభను తరలి రానున్నారు.

మరోవైపు.. రేపటి నుంచి 47వ శాసన మండలి, 16వ శాసనసభ మూడవ సమావేశ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ




ఏర్పాట్లకు సంబంధించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తాతో సమీక్షా నిర్వహించారు. గవర్నర్ ప్రసంగం జరిగే రోజు ఉదయం 9.30 గంటలకు సభ్యులందరూ సభకు హాజరు కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, అధికారుల వ్యక్తిగత సహాయకులకు పాసులు జారీ చేయడం లేదని స్పష్టం చేశారు. వారికి ఎట్టి పరిస్థితుల్లో ప్రవేశం ఉండదని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రిని కలిసే సందర్శకులు, ప్రతినిధులను శాసనసభ ప్రాంగణంలోకి అనుమతించరని చెప్పారు. అందుకోసం వచ్చే వారు... సీఎంవోలనే భేటీ కావాల్సి ఉంటుందని సూచించారు. శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని.. అలాగే పోలీసు శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా అందరికీ వారు విజ్ఞప్తి చేశారు.

సమావేశాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న మీడియా పాయింట్, కొత్తగా నిర్మిస్తున్న క్యాంటీన్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా పరిశీలించి ఈ సందర్భంగా స్పీకర్ పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శాసనసభ కార్యదర్శి జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఇతర ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ అసెంబ్లీ సమావేశాలకు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

పాటు సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఈ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే అని పట్టుబట్టే అవకాశాలున్నాయి. . ప్రతిపక్షంలో ఉన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాసమస్యలపై గొంతువిప్పేది తాము మాత్రమే కాబట్టి.. ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్ష హోదా కోరుతూ ఇప్పటికే హైకోర్టులో వైసీపీ పిటిషన్ దాఖలు చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్‌ను హైకోర్టు కోరినా.. ఇప్పటివరకూ తన అభిప్రాయాన్ని చెప్పలేదు.

ఈ క్రమంలో ప్రతిపక్ష హోదాపై మళ్లీ రాజకీయాలు వేడెక్కాయి.. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అవమానిస్తోందని ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు అసెంబ్లీకి వెళ్ళాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఎవరికో భయపడి అసెంబ్లీకి వెళ్లడంలేదని.. ప్రజా సమస్యలపై పోరాడేందుకు వెళ్తున్నామన్నారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా.. కూటమి ప్రభుత్వం అవమానిస్తోందని ఆరోపించారు. జగన్‌కు సరైన భద్రత కూడా ఇవ్వడంలేదని.. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు వైవీ సుబ్బారెడ్డి..

అసెంబ్లీ ప్రాంగణంలో కట్టుదిట్టంగా నిబంధనలు అమలు

మరోవైపు అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రాంగణంలో




నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. పాసులు ఉన్నవారిని మాత్రమే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించనున్నారు. మండలి ఛైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు మాత్రమే అసెంబ్లీ గేట్ 1 నుంచి అనుమతి ఉంటుంది. గేట్ 2 నుంచి మంత్రులకు మాత్రమే అనుమతి ఇస్తారు. గేట్ 4 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాత్రమే అనుమతిస్తూ బులెటిన్ జారీ చేశారు.

మండలి ఛైర్మన్, స్పీకర్, ముఖ్యమంత్రులు వచ్చి వెళ్లే కారిడార్‌లోకి ఇతరులెవరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. మంత్రులు, సభ్యుల వ్యక్తిగత సహాయకులను అవసరం మేరకు మాత్రమే అనుమతిస్తామని.. ఇతరులకు అనుమతి లేదన్నారు. శాసనసభ పరిసరాల్లో సమావేశాలు, ప్రదర్శనలు, ధర్నాలు, బైఠాయింపులు పూర్తిగా నిషేధించారు. అయితే ఇదంతా జగన్ వస్తున్నందుకే అంటూ వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు.

# రూ.3 లక్షల కోట్లతో.. బడ్జెట్

**విజయవాడ :** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 24న ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఏపీ అభివృద్ధిలో ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని నేతలు చెబుతున్నారురాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 28న చట్ట సభలకు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. పయ్యావుల కేశవ్ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపడతారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడంతో.. ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఉభయ సభల సమావేశం ప్రారంభం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఈనెల 25న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉండనుంది.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోలో చెప్పిన పథకాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం వనరుల సమీకరణపై ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో రెండు మూడుసార్లు సమావేశమయ్యారు.చంద్రబాబుతో సమావేశం తర్వాత.. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్.. అన్ని శాఖల మంత్రులు, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యంగా జలవనరుల శాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, విద్య, వైద్య శాఖలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇటు కేంద్ర ప్రాయోజిత పథకాలను ఎక్కువగా వినియోగించుకునేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అటు కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టేలా ప్లాన్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ.. నిధులు



సమీకరించుకోవాలి ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా విద్య, వైద్య శాఖ ద్వారా కేంద్రం నుంచి ఎక్కువ నిధులు పొందవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను.. కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక విధానాన్ని అమలు చేసింది. దీంతో ఆదాయం తగ్గింది. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం చేస్తోంది. ఇది కొంతమేర ఊరటనిస్తోంది. అయితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక సాయం చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతున్నారు.గత ప్రభుత్వం భవిష్యత్తు ఆదాయాలను కూడా తాకట్టు పెట్టిందని.. ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్లతో నవంబర్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.

సరే.. ఇవన్నీ పక్కనపెడితే బడ్జెట్ పై ఇప్పటికే అధికారులు కసరత్తులు చేశారు. ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అధికారులతో సమావేశమై ఏ ఏ శాఖలకు నిధులు కేటాయింపులు జరపాలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 - 25 సంవత్సరానికి 2.95 లక్షల కోట్లతో బడ్జెట్ అంచనాలను రూపొందించి గత శాసనసభలో ప్రవేశపెట్టింది. ఇందులో రెవెన్యూ వ్యయంగా 2,35,916 కోట్లు, మూలధన వ్యయంగా 32,712 కోట్ల రూపాయలుగా చూపించింది. ప్రభుత్వం మారింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం మూడు లక్షల కోట్లకు పైగానే బడ్జెట్ ను శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశముంది... అయితే గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు నిధుల కేటాయింపుపైనే ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వరసగా మూడు నెలలకు మూడు హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. మార్చి నెలలో మహిళలకు బస్సు ప్రయాణం, ఏప్రిల్ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, మే నెలలో తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేయాలని ఇప్పటికే చంద్రబాబు నిర్ణయించారు. ఈ మూడు పథకాలకు సంబంధించి దాదాపు పదిహేను నుంచి ఇరవై వేల కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. అయితే ఈ పథకాలకు సంబంధించి ఇంత వరకూ విధివిధానాలను ఖరారు చేయకపోవడంతో పాటు నిధులు ఎంత కేటాయిస్తారన్న దానిపై కూడా చర్చ జరుగుతుంది. మరొక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్ట్ అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించాలి. కేవలం పోలవరానికి మాత్రమే కాకుండా బనకచర్లకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. బనకచర్ల ను చంద్రబాబు గేమ్ ఛేంజర్ గా అభివర్ణిస్తుండటంతో దానికి నిధులు కేటాయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. మరొక వైపు సంక్షేమ పథకాలకు కూడా పెద్దయెత్తున నిధులు కేటాయించాల్సి ఉంటుంది. బడ్జెట్ లో కేటాయింపులను బట్టే అవి అమలవుతాయా? లేదా? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశముంది. అందుకే మార్చి 3వ తేదీన ప్రవేశ పెట్టే బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి కూటమి ప్రభుత్వం ఏంచేస్తుందన్నది చూడాలి.

## ప్రజా సేవలో తిరుగులేని నాయకుడు ఎర్రన్నాయుడు

-మొదటిపేజీ తరువాయి

బలమైన సంకల్పం ఉంటే భాష అసలు సమస్యే కాదంటూ దిల్లీ రాజకీయాల్లో ఎర్రన్న చెరగని ముద్ర వేసారని గుర్తు చేసుకున్నారు. ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయిన ఉత్తరాంధ్ర ముద్దు బిడ్డ కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.

**సొంత గ్రామంలో..**

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో దివంగత మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 68వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎర్రన్నాయుడు భార్య విజయమ్మతో కలసి ఆయన కుమారుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎర్రన్న సోదరుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఇతర కుటుంబ సభ్యులు, జిల్లా లోని పార్టీ ముఖ్య నేతలు ఎర్రన్నాయుడు ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.

## గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు 92 శాతం మంది హాజరు

-మొదటిపేజీ తరువాయి

ఈ దశలో పరీక్ష వాయిదా వేయలేమని నిన్ననే స్పష్టం చేసింది. గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 92,250 మంది అభ్యర్థుల్లో 86,459 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా.. వారిలో 92శాతం మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

గ్రూప్-2 ప్రధాన పరీక్షను వాయిదా వేయాలని కూటమి ప్రభుత్వం సూచించినా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాత్రం యథావిధిగా పరీక్ష నిర్వహించింది. పరీక్ష నిర్వహణ అభ్యర్థులకు శ్రేయస్కరం కాదని, హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సినందున వాయిదా వేయాలని ఏపీపీఎస్సీ కార్యదర్శికి సాధారణ పరిపాలన శాఖ లేఖ రాసింది. పరీక్ష రాసే అభ్యర్థులు డిగ్రీ పూర్తిచేసిన వారని, వాయిదా వేస్తే అది శాసనమండలి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఏపీపీఎస్సీ కార్యదర్శి శనివారం సాయంత్రం ప్రభుత్వానికి లేఖరాశారు. శాసనమండలి ఎన్నికలు నిర్వహించే కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోనే ఏపీపీఎస్సీ ఉన్న విషయాన్ని అందులో గుర్తుచేశారు. వాయిదా నిర్ణయం డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులను ప్రభావితం చేస్తుందన్న విషయాన్ని అందులో పేర్కొన్నారు. ఈ క్రమంలో పరీక్ష నిర్వహణపై శనివారం రోజంతా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరి వరకు వాయిదా పడుతుందన్న ఆశతో ఉన్నవారు.. దూరప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

## సైలెంట్‌గా జిల్లా టూర్లలలో జగన్

**గుంటూరు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటిపోయింది కానీ ప్రతిపక్ష నేతగా జగన్ తన మార్క్ చూపించడంలో విఫలమయ్యారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఆయనకు లేనప్పటికీ ఏపీలో ఉన్న ఏకైక ప్రతిపక్ష నేత మాత్రం ఆయనే. దానికి తగ్గట్లుగా పోరుబాట ఎంచుకుంటారని.. అనుకున్నారు కానీ ఆయన నింపాదిగా ఉన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే వరకూ వేచి చూడాలని అనుకున్నారు. అందుకే కార్యకర్తలను పరామర్శించేందుకు ఆయన జిల్లాల టూర్ పెట్టుకున్నారు. కానీ దాని గురించి ఇప్పుడు మాట్లాడటం లేదు. కానీ ప్రజా సమస్యలపై మాత్రం మెల్లగా పర్యటనలు ప్రారంభించాలని డిసైడయ్యారు. జగన్ రెండు రోజుల కిందట బెంగళూరు నుంచి వచ్చారు. రాగానే విజయవాడలో వంశీ ని జైలులో పరామర్శించారు. అక్కడ ఓ పాప ఆయన కోసం ఏడవడం.. ఆ పాపతో సెల్ఫీ దిగడం వంటి కార్యక్రమాలతో జగన్ మళ్లీ తన రాజకీయం ప్రారంభించారని వైసీపీ నేతలు అర్థం చేసుకునవారు. వెంటనే గుంటూరులో మిర్చి రైతుల పరామర్శకు అని వెళ్లారు. ఎన్నికల కోడ్ ఉన్నా సరే లెక్క చేయలేదు. అనుమతి లేని పర్యటనకు పోలీసులు కూడాపెద్దగా బందోబస్తు ఏర్పాటు చేయలేదు. ఆక్కడ ఆవేశంగా చంద్రబాబుపై విమర్శలు చేశారు. మిర్చి కోరు కారణంగా ఇబ్బంది పడినప్పటికీ కొంత మంది రైతులతో మాట్లాడి వెళ్లారు. అక్కడ కూడా జగన్ మార్క్ కనిపించింది. జగన ఇటీవలి కాలంలో ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు. వారానికి మూడు లేదా నాలుగు రోజులు తాడేపల్లిలో ఉంటున్నారు. దానికి సంబంధించి ఆయన కారణాలు ఆయనకు ఉండవచ్చు కానీ ఏపీకి వచ్చిన రోజుల్లో తాడేపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించేవారు. అయితే ఇక నుంచి ఓ జిల్లా పర్యటనకు వెళ్లాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్రజాసమస్యలను తీసుకుని ఆ సమస్య పరిశీలనకు జగన్ ప్రజల్లోకి వెళ్లాలని అనుకుంటున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. తన ప్లాన ను బయట పెట్టలేదు కానీ అన్ ప్లాన్డ్ గానే ఆయన ప్రజల్లోకి వెళ్తే మంచి స్పందన వస్తుందని కొత్తగా వ్యూహకర్తలు ప్లాన్ రెడీ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. అసెంబ్లీకి హాజర్యయేందుకు సిద్ధంగా లేరు. ప్రతిపక్ష నేత హోదా ఇచ్చి చంద్రబాబుతో సమానంగా మాట్లాడే అవకాశం ఇస్తేనే వస్తానని ఆయనంటున్నారు కాబట్టి హాజరయ్యే అవకాశం లేదు. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆయన సైలెంట్ గా ఉండే అవకాశం లేదు. ఏదో ఓ రాజకీయ కార్యక్రమం పెట్టుకుంటారు. గతంలో ఆయన మాక్ అసెంబ్లీ నిర్వహించాలని అనుకున్నారు. కానీ నిర్వహించలేదు. ఈ సారి జనాల్లోకి వెళ్లాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీకి ఎందుకు వెళ్లలేదో తన వాదన వినిపిస్తూ.. అక్కడి నుంచి ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తానని ఆయన వ్యూహాన్ని ఖరారు చేసుకునే అవకాశం ఉంది.

## అర్ధరూపాయికి టమోటా

**కర్నూలు :** టమాటా ధరలు రోజురోజుకూ పతనం అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో రెండు రూపాయలకు కూడా మార్కెట్ లో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం లేదు. మొన్నటి వరకూ కిలో నలభై నుంచి యాభై వరకూ బయట మార్కెట్ లో పలికిన టమాటా ధర నేడు పది రూపాయలకు పడిపోయింది. టమాటా తినే వినియోగదారులకు ఇది లాభదాయకమే అయినప్పటికీ, దానిని పండించే రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తికొండ, మదనపల్లి మార్కెట్ లో కిలో టమాటా ధర అర్థ రూపాయికి కూడా కొనేవారు లేరు. దీంతో టమాటా పండించిన రైతులు కనీసం తాము పండించిన దానికి పెట్టుబడి రాకపోవడంతో మార్కెట్ బయట పారేసి వెళుతున్నారు. మరికొందరు రైతులు మాత్రం పొలాల్లోనే పశువుల మేతగా టమాటాను వదిలేస్తున్నారు. టమాటా కోయడానికి రైతులు కూలీలకు చెల్లించాల్సిన మొత్తం కూడా రాదని తెలియడంతో దానిని కోయడం అనవసరమని పొలాల్లోనే వదిలేస్తున్నారు. పశువులకు మేతగా తీసుకెళ్లవచ్చని కొన్ని చోట్ల పశువుల కాపర్లకు రైతులు చెబుతున్నారు. దీంతో టమాటా ధరలు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదని తెలిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా నవంబరు మాసం నుంచి టమాటా దిగుబడులు ఎక్కువగా వస్తుంటాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుమతి అవుతుంటాయి. అందుకే కావాల్సిన దానికన్నా ఎక్కువ టమాటా మార్కెట్ లోకి వస్తుంది. దీని వల్ల ధరలు పడిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. టమాటా ధరల రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఏపీ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. టమాటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వ్యవసాయశాఖ చర్యలను ప్రారంభించింది. అనంతపురం, కర్నూలు, విజయనగరం జిల్లాల్లో ప్రభుత్వం టమాటా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఇప్పటివరకు రైతుల నుంచి కిలో ఎనిమిది రూపాయల చొప్పున వెయ్యి క్వింటాళ్ల టమాటా కొనుగోలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. విజయవాడ, విశాఖ, రాజమండ్రి, గుంటూరు రైతుబజార్లలో టమాటా విక్రయాలు చేపట్టారు. నాఫెడ్, ఏసీసీఎఫ్ ద్వారా ఆపరేషనల్ ఖర్చులు భరించేలా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. కిలో టమాటాపై పది రూపాయల నుంచి పదిహేను రూపాయల గిట్టుబాటు ధర అందేలా ఏపీ వ్యవసాయశాఖ చర్యలు ప్రారంభించింది. కానీ ఇప్పటికీ రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని చెబుతున్నారు. తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో విక్రయించేలా కేంద్రంతో చర్చలు ప్రారంభించింది.

## సంపాదకీయం

# ఉదారతకు ట్రంప్ వీడ్కోలు!

రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కింది మొదలు వ్యవస్థల్ని ఎడాపెడా తొక్కుకుంటూ పోతున్న డోనాల్డ్ ట్రంప్ దృష్టి ప్రపంచ దేశాలకు ఉదారంగా సాయం అందించే అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ ఎయిడ్)పై పడింది. గత నెల 27నే ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. దాన్నుంచి విడుదలయ్యే నిధుల గురించి సమీక్షించి ఆ పంపిణీని 'మరింత సమర్థంగా', తమ విదేశాంగ విధానానికి అనుగుణంగా వుండేలా రూపుదిద్దుతామని ఆ సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు దాని తాలూకు సెగలూ పొగలూ మన దేశాన్ని కూడా తాకాయి. ఆ సంస్థ నుంచి లబ్ధి పొందింది 'మీరంటే మీర'ని బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో గాలించి గత చరిత్ర తవ్వి పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. వెనకా ముందూ చూడకుండా చొరవగా దూసుకెళ్లే బీజేపీయే ఈ వాగ్యుద్ధానికి అంకు రార్పణ చేసింది. కాంగ్రెస్, మరికొన్ని పౌర సమాజ సంస్థలూ యూఎస్ ఎయిడ్ నుంచి దండిగా నిధులు పొందాయన్నది బీజేపీ ఆరోపణల సారాంశం. పనిలో పనిగా ప్రపంచ కుబేరుడు జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కున్న సంబంధాలు మరోసారి ప్రస్తావనకొచ్చాయి. జార్జి సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి యూఎస్ ఎయిడ్‌కు ప్రధానంగా నిధులు వస్తాయి గనుక దాన్నుంచి నిధులందుకున్నవారంతా మచ్చపడినవారేనని బీజేపీ అభియోగం. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మరో అడుగు ముందుకేసి యూఎస్ ఎయిడ్ నిధులతోనే ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచే నిరసనోద్యమాలు దేశంలో గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయని తేల్చారు. దేశద్రోహులు అనే మాటైతే వాడలేదుగానీ... ఆ చట్రంలో ఇమిడే కార్యకలాపాలన్నిటినీ పరోక్షంగా కాంగ్రెస్‌కూ, ఇతర సంస్థలకూ అంటగడుతూ ఏకరువు పెట్టారు. అటు కాంగ్రెస్ ఊరుకోలేదు. కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ఒకప్పుడు యూఎస్ ఎయిడ్ రాయబారిగా పనిచేయటం, నీతి ఆయోగ్, స్వచ్ఛభారత్ వంటి సంస్థలకు నిధులు రావటం వగైరాలను ప్రస్తావించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యా లయం వెబ్‌సైట్ సమాచారం ప్రకారం యూఎస్ ఎయిడ్ మన ప్రాథమిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వ్యవసాయం, తాగునీరు, ఇంధనం వగైరాలకు సాయపడుతున్నది. ఇదంతా చూస్తుంటే 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏర డం' నానుడి గుర్తుకొస్తుంది. 1961లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఏలుబడిలో ప్రారంభమైన ఈ సంస్థనుంచి నిధులందుకున్న పార్టీలూ, స్వచ్ఛంద సంస్థలూ కొల్లలుగా ఉన్నాయని భావించవచ్చు. ప్రభుత్వ కార్యక్రమా లకు కూడా అది సాయపడింది. అమెరికా తన బడ్జెట్‌లో ఒక శాతాన్ని అంతర్జాతీయ సాయానికి కేటాయిస్తున్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యధిక మానవతా సాయాన్ని అందించే ఏకైక దేశం అమెరికాయే. అంతర్జాతీయంగా నిరుడు వివిధ దేశాలకు అందిన సాయంలో అమెరికా వాటా 40 శాతం. 2025 ఆర్థిక సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ ద్వారా 5,840 కోట్ల డాలర్లు వ్యయం కావొచ్చన్న అంచనా ఉంది. ట్రంప్ ప్రస్తుతం దాన్ని నిలుపుదల చేశారు గనుక ఇందులో ఎంత మొత్తానికి కత్తెరపడుతుందో అంచనా వేయటం కష్టం. మనకైతే ఇకపై రాక పోవచ్చు. ఎందుకంటే ట్రంప్ ఉద్దేశంలో భారత్ సంపన్న దేశం. 2021 నుంచి నిరుడు డిసెంబర్ వరకూ మన దేశానికి 2 కోట్ల డాలర్లు కేటాయించగా అందులో కోటీ 25 లక్షల డాలర్లు అందించి నట్టు లెక్కలున్నాయి. ఇదంతా 'ప్రజాతంత్ర భాగస్వామ్యం', పౌర సమాజం కోసం అని యూఎస్ ఎయిడ్ అంటున్నది. ఇందులో 55 లక్షల డాలర్లు నిరుడు జరిగిన ఎన్నికల్లో పెద్దయెత్తున వోటర్లు పాల్గొనేలా చూడటానికి అందించారు. ఏ సంస్థ ఎంత పొందిందన్న వివరాలు మాత్రం లేవు. దక్షిణ అమెరికాలో అమెజాన్ అడవుల రక్షణ, ఆఫ్రికాలో వ్యాధులు అరికట్టడానికి, ఆడపిల్లల విద్యకు, ఉచిత మధ్యాహ్న భోజనానికి సాయం చేయగా... రష్యా ఇరుగు పొరుగు దేశాల్లో దాని ప్రభావం తగ్గించటానికి, యుద్ధక్షేత్రమైన సిరియాలో ఆస్పత్రుల కోసం, ఉగాండాలో అట్టడుగు తెగల అభ్యున్నతికి, కంబోడియాలో మందుపాతరల తొలగింపునకు, బంగ్లాలో పౌరసమాజం కోసం... ఇలా భిన్నమైన పథకాలకూ, కార్యక్రమాలకూ అమెరికా తోడ్పడుతోంది. అసలు ఎవరైనా ఎందుకు సాయం చేస్తారు? వ్యక్తుల వరకూ చూస్తే తమ ఎదుగుదలకు కారణమైన సమాజానికి తిరిగి ఏదో ఇవ్వాలన్న కృతజ్ఞతా భావన కారణం కావొచ్చు. కానీ ఏ ఉద్దేశమూ లేకుండా అయా చితంగా ఖండాంతరాల్లోని సంపన్న దేశాలు వేరే దేశాలకు ఎందుకు తోడ్పాటునిస్తున్నాయి? చరిత్ర తిరగేస్తే దీని వెనకున్న మతలబు అర్థమవుతుంది. అప్పట్లో సోవియెట్ యూనియన్ ప్రభావం నుంచి ప్రపంచాన్ని 'రక్షించే' బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని అమెరికా ఈ సాయం మొద లెట్టింది. అటు సోవియెట్ సైతం ఆ పనే చేసేది. ప్రపంచం దాదాపు రెండు శిబిరాలుగా చీలిన ఆ కాలంలో అమెరికా, సోవియెట్‌లకు ఈ ఉదారత ఎందుకంటిందో సులభంగానే గ్రహించవచ్చు. సాధారణ ప్రజానీకంలో తమపట్ల అనుకూల భావన కలిగితే అవతలివారిని సగం జయించినట్టేనని ఆ రెండు దేశాలూ భావించేవి. ప్రపంచ దేశాలన్నీ ప్రత్యర్థులుగా కనబడుతున్న వర్తమానంలో అమెరికాకు ఉదారత అవసరం ఏముంది? 'నేను ఆదేశించింది పాటించటమే తప్ప నాతో తర్కానికి దిగొద్ద'ని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశం ఈ సాయాన్ని ముందే తిరస్కరించి ఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ ఇవ్వబోమని అమర్యాదకరంగా చెప్పించుకోవటం ఆత్మాభిమానం గల భారతీయులందరికీ చివుక్కుమనిపించే సంగతి. పాలకులు గ్రహిస్తారా?

# చెదిరిపోతున్న ఐటీ కల



గత రెండు దశాబ్దాలుగా మధ్యతరగతి ప్రజల మనస్తత్వాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. మరింత మెరుగైన జీవితాన్ని ఆశిస్తున్న తల్లిదండ్రులు తాము కష్టపడుతూ పిల్లలను ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని కలలుగన్నారు. తమ పిల్లాడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని చెప్పుకోవాలని ఉవ్విళ్లూరారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వారి ఆశలను చిదిమేస్తున్నది. భవిష్యత్తులో ఐటీ ఉద్యోగాలను కృత్రిమ మేధ అమాంతం మింగేస్తుందన్న భయాలు నెలకొన్నాయి. ఇన్ఫోసిస్ మైసూర్ క్యాంపస్ ఇటీవల 400 మంది ట్రైనీ ఉద్యోగులను తొలగించడం ఏఐ ఇస్తున్న హెచ్చరికగానే భావించాలి. నిజానికి భారత్‌లో అత్యధిక వేతనాలు చెల్లిస్తున్నది ఐటీ రంగమే. అయితే, కృత్రిమ మేధ రాకతో ఇప్పుడు దీనిని గత చరిత్రగానే చెప్పుకోవాలి. నెలకు రూ.20 వేల నుంచి రూ. 25 వేలు అందుకున్న ఇద్దరు ఫ్రెషర్ల స్థానంలో రూ. 17 వేలు మాత్రమే చెల్లించి ఏఐతో వారి సేవలను భర్తీ చేసుకునే వెసులుబాటు ఇప్పుడు ఐటీ కంపెనీలకు లభించింది. అదే నెలకు రూ. 17,500 ఖర్చు చేస్తే పీహెచ్‌డీ స్థాయి ఏఐ ఏజెంట్‌ను యాక్సెస్ చేసుకొని నెలకు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వేతనం చెల్లిస్తున్న ఉద్యోగులను భర్తీ చేసుకోవచ్చు. బడా ఐటీ కంపెనీలకు ఈ విషయం రెండేండ్ల క్రితమే తెలుసు. 2022 ఏడాది చివరలో వచ్చిన 'చాట్‌జీపీటీ' ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో పెను ప్రకంపనలే సృష్టించింది. టెక్ కంపెనీలకు ఇది ఒక రకంగా వరం కాగా, మరో రకంగా ముప్పు కూడా పొంచి ఉన్నది. మరీ ముఖ్యంగా భారత్‌లోని ఐటీ కంపెనీలకు ఏఐ భయం పట్టుకుంది. ఇక్కడి సంస్థల్లో చాలావరకు విదేశీ కంపెనీలకు పనిచేస్తాయి. వారికి కావాల్సిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అందిస్తాయి. వారి డాటాను డిజిటలైజ్ చేస్తాయి. అయితే, ఇప్పుడు విదేశీ కంపెనీలు భారత్‌కు ఔట్ సోర్సింగ్ ఇవ్వడానికి బదులు చాట్‌జీపీటీకే ఆ పని అప్పగించే అవకాశం ఉన్నది. 'స్టెబిలిటీ ఏఐ' రూపకర్త ఇమాద్ మొస్టాక్ 2023 జూలైలోనే ఈ పరిణామాన్ని అంచనా వేశారు. ఏఐ వల్ల తొలుత ఉద్యోగాలు కోల్పోయేది భారత్‌లోని ఐటీ కోడర్లేనని హెచ్చరించారు. భారత్‌లోని కోడ్ రైటర్ల కంటే ఏఐ మరింత మెరుగ్గా పనిచేస్తుందని, భారతీయ కంపెనీలు ఇందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. గత రెండేండ్లుగా చూసుకుంటే ఐటీ ఉద్యోగాల సంఖ్య క్రమంగా పడిపోతున్నది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో వంటివి 2023-24 నుంచి ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నాయి. వేతన పెంపుదలను కూడా ఆలస్యం చేస్తున్నాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) గణాంకాల ప్రకారం.. క్లరికల్ స్టాఫ్, టెక్నీషియన్లు కాకుండా ఇండియాలో దాదాపు రెండు కోట్ల మంది వైట్‌కాలర్ ఉద్యోగాలు చేస్తున్నారు. మేజర్ ఐటీ కంపెనీల్లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా టాప్-5లో కొనసాగుతున్నాయి. ఐటీ ఉద్యోగాలు సాధిస్తే తమ బతుకులు గాడిన పడతాయన్న ఆశతో దేశంలోని మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను కంప్యూటర్ సైన్స్ డిగ్రీ వైపు బలవంతంగా పంపుతున్నారు. ఇందుకోసం సంపాదించుకున్న మొత్తాన్ని ఐటీ చదువులకు వెచ్చిస్తున్నారు. దేశంలో ప్రస్తుతం13 లక్షల మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేస్తున్నారు. నిజానికి ఐటీ జాబ్ సౌకర్యవంతమైన జీవితానికి గ్యారెంటీ మాత్రమే కాదు.. విదేశాల్లో, మరీ ముఖ్యంగా అమెరికా వంటి దేశాల్లో ఉద్యోగానికి అది తలుపులు తెరుస్తుంది. విదేశీ కంపెనీలు భారత్‌లోని టెక్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం వెనుక బలమైన కారణమే ఉంది. ఎందుకంటే భారత్‌లోని టెక్ కంపెనీలు చాలా తక్కువ ధరకే ప్రాజెక్టులు చేసి పెడతాయి. దీనినిబట్టి అర్థం చేసుకోవాల్సింది ఒకటి ఉంది. రానున్న రోజుల్లో ఐటీ రంగంలో ఉద్యోగాలు పెరిగినా వేతనం మాత్రం తగ్గుతుంది. ప్రస్తుతం పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లకు మధ్యస్థంగా నెలకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు ఆఫర్ చేస్తున్నాయి. పదేండ్ల క్రితంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. 2015లో వాస్తవ కొనుగోలు శక్తి రూ. 25 వేలు ఉంటే ప్రస్తుతం అది రూ. 40 వేలుగా ఉన్నది. అప్పట్లో వేతన పెంపు కూడాఎక్కువగా ఉండటంతోపాటు క్రమం తప్పకుండా ఉండేది. ఇప్పుడా స్థాయికి చేరుకోవాలంటే చాలా కాలం పడుతుంది.

'బ్లూమ్‌బర్గ్' సర్వే ప్రకారం వచ్చే కొన్ని సంవత్సరాల్లో వాల్‌స్ట్రీట్‌లో ఏకంగా 2 లక్షల ఉద్యోగాలు మాయమయ్యే అవకాశం ఉన్నది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో సగానికి పైగా ఉద్యోగాలను ఏఐ మింగేస్తుందని సర్వే అంచనా వేసింది. భారత్‌లోని మధ్యతరగతికి ఇది మరో ఎదురుదెబ్బనే చెప్పాలి. ఎందుకంటే వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఎక్కువ శాతం ఆర్థిక రంగంలోనే ఉన్నాయి. ఇక, తాజా పరిణామాలు మధ్యతరగతికి ఒక గుణపాఠంగానే భావించాలి. పిల్లలకు ఇష్టం లేకున్నా కంప్యూటర్ సైన్స్ వైపే వెళ్లాలంటూ వారిపై ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలి. గత రెండు దశాబ్దాలుగా ఐటీ ఉద్యోగాలు స్థిరంగా పెరుగుతున్నప్పటికీ, సూపర్ టాలెంట్ ఉంటే తప్ప ఇప్పుడు మనుగడ సాగించలేని పరిస్థితులున్నాయి. అయితే, ఇది ఒక్క ఇండియాకే పరిమితమైన సమస్య కాదు. ప్రతి చోటా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. అమెరికాలో కొవిడ్‌కు ముందున్న కాలంతో పోలిస్తే సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ ఉద్యోగాలు 35 శాతం పడిపోయాయి. ముఖ్యంగా చాట్ జీపీటీ వచ్చాక ఉద్యోగాల్లో క్షీణత మొదలైంది. మరో చేదు నిజం ఏంటంటే.. ఏఐ ప్రభావం ఒక్క టెక్ రంగానికే పరిమితం కాదు, ప్రతి రంగంలోనూ ఇది ఉద్యోగాలను భర్తీ చేయగలదు. 'బ్లూమ్‌బర్గ్' సర్వే ప్రకారం వచ్చే కొన్ని సంవత్సరాల్లో వాల్‌స్ట్రీట్‌లో ఏకంగా 2 లక్షల ఉద్యోగాలు మాయమయ్యే అవకాశం ఉన్నది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో సగానికి పైగా ఉద్యోగాలను ఏఐ మింగేస్తుందని సర్వే అంచనా వేసింది. భారత్‌లోని మధ్యతరగతికి ఇది మరో ఎదురుదెబ్బనే చెప్పాలి. ఎందుకంటే వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఎక్కువ శాతం ఆర్థిక రంగంలోనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి ఒక తరం.. వారి తల్లిదండ్రుల కంటే తక్కువ సంపాదించే ప్రమాదంలో పడింది. ఉద్యోగాలు రాని యువతీయువకులు వారి తల్లిదండ్రులపైనే ఆధారపడతారు. వివాహాలు ఆలస్యమవుతాయి. ఇది వారిని మానసికంగా కుంగదీస్తుంది. నిరాశ పెరుగుతుంది. చిన్నచిన్న విషయాలకే గొడవలు పడటం సర్వసాధారణం అయిపోతుంది. భారతదేశంలో నాలుగు దశాబ్దాలుగా మధ్యతరగతి ప్రజలు ఐటీ కలల చుట్టూనే తిరుగుతున్నారు. కాబట్టి తర్వాతి తరమైనా ఆనందంగా జీవించాల్సిన అవసరం ఉన్నది. స్నేహితులతో గడపడం, పార్కులో ఓ సాయంత్రం అలా వాకింగ్ చేయడం, పుస్తకం చదవడం, ఆడిపాడటం ద్వారా ఆనందాన్ని వెతుక్కోవాలి. సూర్యుడు ఉదయించడానికి ముందు వచ్చే చీకటి కాలానికి మధ్యతరగతి ప్రజలు సిద్ధంగా ఉండాలి.

# దీనావస్థలో యూరప్ దేశాలు



కళ్లముందు ప్రమాదకర సంకేతాలు కనబడుతున్నా అమెరికాను గుడ్డిగా అనుసరిస్తూ పోవటం అలవాటు చేసుకున్న యూరప్‌కి డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక వరస షాక్‌లు తప్పడం లేదు. గతవారం జర్మనీలో జరిగిన మ్యూనిక్ భద్రతా సదస్సుకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'వాక్ స్వాతంత్ర్యానికీ, ప్రజాస్వామ్యానికీ మీవల్లే ముప్పు ముంచుకొస్తున్నద'ని యూరప్ దేశాలపై విరుచుకుపడ్డారు. దాన్నుంచి తేరుకోకముందే ఆ దేశాల ప్రమేయం లేకుండా ఉక్రెయిన్ యుద్ధం నిలుపుదలపై రష్యాతో సౌదీ అరేబియాలోని రియాద్‌లో అమెరికా భేటీ అయింది. యూరప్ వరకూ ఎందుకు... రష్యాతో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంలో శిథిలావస్థకు చేరిన ఉక్రె యిన్‌నే ఆ చర్చలకు ఆహ్వానించలేదు. యుద్ధం ఆపడానికి అవకాశాలున్నాయా, ఆ విషయంలో తొలి అడుగువేయటం అసలు సాధ్యమేనా అనే అంశాలను నిర్ధారించుకోవటానికే రియాద్ సమా వేశం జరిగిందని అమెరికా విదేశాంగశాఖ సంజాయిషీ ఇస్తున్నా దాని వ్యవహారశైలి యూరప్ దేశా లకు మింగుడు పడటం లేదు. ఆ విషయంలో నిజంగా చిత్తశుద్ధి వుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడటానికి ముందు ట్రంప్ యూరప్ దేశాల అధినేతలను సంప్రదించేవారు. దాదాపు ఎనభైయ్యేళ్లుగా యూరప్ దేశాలన్నీ అమెరికా అడుగుజాడల్లో నడిచాయి. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సైన్యాన్ని మట్టికరిపించిన సోవియెట్ సేనలు తూర్పు యూరప్ దేశాల తర్వాత తమవైపే చొచ్చుకొస్తాయని, తాము బలికావటం ఖాయమని పశ్చిమ యూరప్ దేశాలు వణికిపోయాయి. నాటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ దీన్ని చక్కగా వినియోగించుకుని ఉత్తర అమెరికా ఖండంలో తన పొరుగు దేశమైన కెనడాను కలుపుకొని పశ్చిమ యూరప్ దేశాలతో జత కట్టి పటిష్ఠమైన సైనిక కూటమి నాటోకు అంకురార్పణ చేశారు. అమెరికా%-%సోవియెట్‌ల మధ్య సాగే పోటీలో యూరప్ దేశాలు అవసరం లేకున్నా తలదూర్చాయి. ఆర్థికవ్యవస్థలు అనుమతించక పోయినా తమ తమ జీడీపీల్లో రెండు శాతం నాటో కోసం వ్యయం చేశాయి. యూరప్ భూభాగంలో అణ్వాయుధాల మోహరింపు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, మారణాయుధాలు జోరందుకున్నాయి. యూరప్ దేశాలకు ఆనాటి సోవియెట్ నుంచి లేదా ప్రస్తుత రష్యా నుంచి ఎన్నడూ ముప్పు కలగలేదుగానీ... నాటోవల్ల లిబియా, సిరియా, అఫ్గానిస్తాన్, సూడాన్, సోమాలియా తది తర దేశాలు అస్థిరత్వంలోకి జారుకుని ఉగ్రవాదం వేళ్లూనుకుంది. సిరియావంటి దేశాల్లో ప్రభుత్వా లను కూలదోసేందుకు విచ్చలవిడిగా ఆయుధాలందించటంవల్ల ఐసిస్ అనే భయంకర ఉగ్రవాద సంస్థ ఆవిర్భవించింది. ఉక్రెయిన్ దురాక్రమణకు రష్యాను రెచ్చగొట్టింది కూడా యూరప్ దేశాలే. 2013లో అమెరికా ప్రోద్బలంతో ఉక్రెయిన్‌తో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకోవటంతోపాటు ఐఎంఎఫ్ రుణం పొందేందుకు సహకరించింది ఈయూ దేశాల కూటమే.

అయితే ఐఎంఎఫ్ కఠిన షరతులను తిరస్కరించి రష్యా ఇచ్చే 1,500 కోట్ల డాలర్ల రుణం తీసుకోవటానికి అప్పటి ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్ నిర్ణయించటంతో దేశంలో ప్రజా ఉద్యమం పేరిట తిరుగుబాటుకు అంకు రార్పణచేసి అస్థిరపరచటంలో అమెరికా, ఈయూల పాత్ర వుంది.

ఈ పరిణామాలే పుతిన్‌ను క్రిమియా ఆక్రమణకు పురిగొల్పాయి. ఎన్నికల్లో చట్టబద్ధంగా గెలిచిన యనుకోవిచ్‌ను ఈ వంక చూపి 2019లో కూలదోసి, సినీ నటుడు జెలెన్‌స్కీని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం, పర్యవసానంగా మూడేళ్లక్రితం పుతిన్ ఉక్రెయిన్‌పై దండెత్తటం వర్తమాన చరిత్ర.

యుద్ధంపై తమ ప్రమేయం లేని చర్చల్ని గుర్తించబోనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యూరప్ దేశాలకు కనీసం ఆ మాత్రం ధైర్యం కూడా లేదు. తాజా పరిణామాల నేప థ్యంలో ఏం చేయాలో చర్చించటానికి ఫ్రాన్స్ చొరవతో సోమవారం పారిస్‌లో జరిగిన అత్యవసర భేటీకి అరడజను దేశాలు హాజరయ్యాయి. అవి కూడా కింకర్తవ్య విచికిత్సలో పడ్డాయి. ఉక్రెయిన్‌కు శాంతి సేనలను పంపటానికి తాను సిద్ధమని ప్రకటించిన బ్రిటన్... ఆ వెంటనే 'అమెరికా అందుకు అనుమతిస్తేనే' అని ముక్తాయించింది. ఈలోగా జర్మనీ, పోలాండ్, స్పెయిన్‌లు దాన్ని అసందర్భ ప్రతిపాదనగా కొట్టిపారేశాయి. అమెరికా తాజా వైఖరితో యూరప్ స్వీయరక్షణ కోసం సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ప్రతిపాదనపై సైతం అనుకూల స్వరాలు వినబడటంలేదు. ట్రంప్ ఆగమనం తర్వాత అమెరికాతో యూరప్ దేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్న అభిప్రాయం అందరిలో ఏర్పడింది. దీనికితోడు ట్రంప్ అనుచరగణం యూరప్‌లో తీవ్ర మితవాద పక్షాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం వివిధ దేశాధినేతలకు ఉంది. ట్రంప్ వైఖరి ఎలా వుంటుందన్న అంశంలో ఆయన తొలి ఏలుబడిలో యూరప్ దేశాలకు తగి నంత అవగాహన వచ్చింది. కానీ దశాబ్దాల తరబడి అమెరికా అనుసరిస్తున్న విధానాలను రెండో దఫాలో మెరుపువేగంతో ఆయన తిరగరాస్తారని ఆ దేశాలు ఊహించలేదు. ఈసారి ట్రంప్ వెనకున్న ఎలాన్ మస్క్, స్టీవ్ బానన్, మార్కో రుబియో తదితరులతోపాటు సమర్థుడైన దూతగా పేరున్న విట్‌కాఫ్‌లే అందుకు కారణం కావొచ్చు. పర్యవసానంగా ట్రంప్ రంగప్రవేశం చేసి నెల తిరగకుండానే యూరప్ దేశాలకు ప్రపంచం తలకిందులైన భావన కలిగింది. స్వతంత్రంగా ఎదగటానికి ప్రయత్నించక కీలుబొమ్మల్లా వ్యవహరించిన ఆ దేశాలు ఇప్పటికైనా వివేకం తెచ్చుకోవాలి. సొంత ఆలోచనతో, స్వీయప్రయోజనాల కోసం పనిచేయటం నేర్చుకోవాలి. రోజులు ఎప్పుడూ ఒకేలా వుండవని గ్రహించాలి.

# విద్యా సంస్థలు సేవా దృక్పథంతో విద్యార్థులను తీర్చిదిద్దాలి.

## ఉల్లంపర్రు మాంటిస్సోరీ వార్షిక వేడుకలలో మంత్రి నిమ్మల రామానాయుడు.






**పాలకొల్లు. ఫిబ్రవరి 23. ప్రజా జ్యోతి (కొట్టి రామం)** విద్యాసంస్థలు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో విద్యార్థులను తీర్చిదిద్దాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటీ స్సోరీస్ స్కూల్ 35 వార్షికోత్సవ వేడుకలలో మంత్రి రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాంటిస్సోరి స్కూలు విద్యాపరంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విలువైన విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలంటే నాలుగు అంశాలు దోహదపడతాయని విద్యార్థులకు విద్య పట్ల ఆసక్తి, మంచి ఆశయం, తల్లిదండ్రుల తోడ్పాటు, విలువైన విద్యాబోధన, మంచి యాజమాన్యం ఉండాలని అప్పుడే విద్యార్థులువిద్యావంతులై ఉన్నత స్థానాలు పొంది సమాజానికి ఉపయోగ పడతారని అన్నారు. చాలా విద్యా సంస్థలు మార్కుల శాతం సాధించటంలో ముందు ఉన్నా విద్యార్థులకు విలువలు నేర్పటంలో వెనుకబడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన అప్పుల ఊబి నుంచి అభివృద్ధి వైపు ఒక్కొక్క అడుగు వేస్తున్నదన్నారు. తల్లికి వందనం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయడం జరుగుతుందని మంత్రి రామానాయుడు తెలిపారు.
అంతకుముందు విడిగా సభలో పాల్గొన్న నర్సాపురం ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు విజ్ఞానము వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలతో విద్యార్థులను తీర్చి దిద్దాలన్నారు.మండల విద్యాశాఖ అధికారి వీరాస్వామి మాట్లాడుతూ తమ పిల్లలు ఏ రంగంలో ఆసక్తి చూపిస్తున్నారో ఆ రంగంలో నిష్ణాతులు అయ్యేలా అయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. స్కూల్ సెక్రెటరీ, కరస్పాండెంట్ ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ తన స్కూలు 35 ఏళ్ల క్రితం 45 మంది విద్యార్థులతో ప్రారంభించబడిందని నేడు 985 మంది విద్యార్థులతో ముందుకు సా గుతున్నద న్నారు. ఇంగ్లీష్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, కాంపిటేటివ్ పరీక్షలకు విద్యార్థులకు తర్ఫీదు, నైపుణ్యానికి పరీక్షలు వంటివి నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ స్కూల్ విద్యార్థులు ఎంతోమంది డాక్టర్లుగా ఇంజనీర్లుగా వివిధ ఉన్నత స్థానాల్లో చేరుకోవడం తమకు ఆనందం కలిగిస్తున్నదన్నారు. స్కూల్ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు మాట్లాడుతూ మాంటిస్సోరీ విద్యాసంస్థలను లాభాపేక్ష తో కాకుండా సేవా భావంతో ముందుకు తీసుకు వెళు తున్నామన్నారు.తాము నిర్వహించిన సైన్స్ పేర్ ఇండియా బుక్ ఆఫ్ ద వరల్డ్ తెలుగు బుక్స్ ఆఫ్ రికార్డ్ నందు చోటు పొందడం తమకు ఆనందం కలిగించిందన్నారు. ప్రిన్సిపాల్ వసంతలక్ష్మి మాట్లాడుతూ తమ స్కూల్ నుండి చదివి వెళ్లిన విద్యార్థులు ఎంతో మంది వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో నిలిచారని భవిష్యత్తులోను తమ విద్యార్థులందరూ ఇదే విధంగా ఉన్నత స్థాయికి చేరుకుంటారని భావిస్తున్నామన్నారు. వివిద అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మంత్రి రామానాయుడు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు.పాఠశాల పూర్వ విద్యార్థి నాసా లో శిక్షణ పొందుతున్న దంగేటి జాహ్నవి ఆకర్షణగా నిలవగా పాఠశాల పూర్వ విద్యార్థి ఆల్ రౌండర్ రవి మిమిక్రీ ఆకట్టుకుంది. సభావేదికపై స్కూల్ విద్యార్థులసంగీత శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూలు ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య పోరాటయోధుడు ద్వారబంధాల చంద్రయ్య దొర.

## శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి ఆధ్వర్యంలో 135వ వర్ధంతి.

**ప్రజా పాలకొల్లు ఫిబ్రవరి 23 కొట్టి గ్రామం** బ్రిటిష్ పాలకుల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గిరిజన, దళిత,బహుజన, పీడిత వర్గాల తరపున పోరాడి ఆత్మార్పణ కు గురిఅయిన స్వాతంత్ర్య సంగ్రామ పోరాట యోధుడు ద్వారబంధాలచంద్రయ్య దొర “ 134 వ వర్ధంతి పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ సమీపంలో శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యరంశెట్టి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న యూకేసి గవర్నర్ పెనుమాక రామ్మోహన్ రావు గారు, కాపు ఉద్యమ నేత ముచ్చర్ల శ్రీరామ్ లు చంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు . సభాధ్యక్షులు యరంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలో మొట్ట మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలోఆత్మార్పణ యోధుడు,1879 రంప పితూరి తిరుగుబాటు నాయకుడు మన్యం బొబ్బిలి ద్వారబంధాల చంద్రయ్య దొర స్వతంత్ర ఉద్యమ చరిత్రలు తెరస్థాయిగా నిలిచారన్నారు
తెలుగు రాష్ట్రాలలో ఏజెన్సీ అయిన ఖమ్మం జిల్లా,భద్రాచలం, తూర్పు గోదావరి జిల్లా, రంపచోడవరం ,అన్నవరం , ఒరిస్సా రాష్ట్రం జయపూర్, ఛత్తీస్ ఘడ్ ప్రాంతాలలో.... బ్రిటీష్ సామ్రాజ్యవాద నిరంకుశ పాలకులు,వారి తొత్తులైన స్థానికసంస్థానాధీశులు,జమీందారులు చంద్రయ్య దొర తిరుగుబాటు ను నయవంచన తో చంద్రయ్య బందువులు తో విషం కలిపిన అన్నం తినిపించి వందలాది బ్రిటీష్ సైనికులు తుపాకులతో చుట్టుముట్టి ఇనుప గొలుసులు తో బంధించి వందలాది తుపాకులతో కాల్చి చంపి నేటికీ 134 సంవత్సరాలు అయిందన్నారు.ప్రభుత్వాలు అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలు చేసే వరకు చరిత్ర విస్మరించిన స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రను వెలికి తీసి మన సమాజానికి తెలియజేయడానికే...
వర్ధంతులు ఇలా ప్రజా సమూహం లో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.
ప్రధాన వక్తగా పాల్గొన్న సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెంద్ర వీరన్న మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల ముఠా దారుల దోపిడీ దౌర్జన్యాలకు బాధితులైనవారి పక్షాన నిలిచి పోరాడిన విప్లవ యోధుడు ద్వారబంధాల చంద్రయ్య దొరను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన తెలుగు నేల నుంచి స్వాతంత్ర్య ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకువెళ్లిన మహోన్నత పోరాట యోధుడు అని పెంద్ర వీరన్న పేర్కొన్నారు.



తెలుగు భాషాపరిరక్షణ సమితి మాడభూషి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చరిత్ర కెక్కిన వారి కన్నా చరిత్ర విస్మరించిన చారిత్రక పోరాటయోధులు ఎందరో వున్నారని వారిలో కొందరిని శ్రీ కృష్ణదేవరాయ సేవా సమితి వారు గుర్తించి ఇలా గుర్తు చేయడం కూడా సామాజిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమములో వంగా నరసింహారావు కొల్లాటి పెద్దిరాజు , కొట్టి భాస్కర రావు ,గంధం కుమారస్వామి రాజా, గంటా నాగరాజు, రాయి సూరిబాబు, యినుకొండ శేషాద్రి,జక్కంపూడి రాంప్రసాద్,దేగల సూర్యప్రభ, డీవీఎన్ రాజు,గుత్తులసత్యనారాయణమూర్తి, గుండుమోగుల వీరాస్వామి, బోనం మునసబు, గంటా ముత్యాలరావు నాయుడు, విద్యాంశెట్టి సుబ్బారావు, దేగల వేంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ ఏజెంట్స్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి




**గుంతకల్ ప్రజా జ్యోతి :** సిపిఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ నాయకులు సి వెంకటేష్ ఆదివారం సిపిఐ కార్యాలయంలో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ వ్యవస్థ ఏర్పడినప్పుడు ఎంతోమందికి ఉపాధి కలిగి ఎనిమిది రాష్ట్రాలలో 32 లక్షల మందితో స్కీముల ద్వారా 6380 కోట్లు డిపాజిట్ చేయించి ,అతి పెద్ద సంస్థగా ఏర్పడింది.మన ఆంధ్రప్రదేశ్లో 19,52 వేల మంది నుండి 3986 కోట్లు డిపాజిట్లు వచ్చాయి.అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ పేర్లతో కంపెనీలు నడుపుతున్నారు . గత రెండు రోజుల క్రితం ఉదయగిరి నియోజకవర్గంలో 500 ఎకరాల పైచిలుకు భూమి అగ్రిగోల్డ్ సంస్థ ఉంది. ఈ భూమిలో జామ్ ఆయిల్, ఎర్రచందనం పెద్ద ఎత్తున ఉన్నాయి.అక్కడ ఉన్నటువంటి కొంతమంది రౌడీ నాయకులు ఎర్రచందనం జామ్ ఆయిల్ లను కొట్టి కోట్ల డబ్బులు జమ చేసుకుంటున్నారు. దీన్ని అగ్రిగోల్డ్ కస్టమర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య తెలుసుకొని ఆ ప్రాంతంలో ఉన్న ఎస్ఐ కి కంప్లైంట్ ఇచ్చి తిరిగి వస్తుంటే 20 మంది చిల్లర మూకలు. తిరుపతయ్య, మొదలగు వారిపై ఎస్ఐ సమక్షం లోనే దాడి జరుగుతుంది. దీన్ని వామపక్ష పార్టీలు వ్యతిరేకిం చాయి. అదేవిధంగా గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఏజెంట్లు చనిపోతే వారిలో కొంతమం దికి మాత్రం ఐదు లక్షలు రూపాయలు ఇచ్చారు .మరియు వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 2021లో 10,000 నుండి 20వేల వరకు డిపాజిట్లు ఉన్నటు వంటి మొత్తాన్ని చెల్లించారు . ఇంకా చాలా చెల్లించేటివి ఉన్నాయి.అదే మన అనంతపురం జిల్లాలో కడవకల్లు దగ్గర అగ్రిగోల్డ్ సంస్థకు సంబంధించిన 200 ఎకరాలలో దౌర్జన్యప రులు యధాచగా అరటి తోట పెట్టుకొని సాగు చేస్తున్నారు. మరి కుదేరులో ఫ్లాట్లు ఉన్నాయి ఇవి కూడా అగ్రిగోల్డ్ ఆస్తులు ఇందులో ఇసుకని యధాచగా తరలించుకుంటున్నారు. ఈనెల 24వ తారీఖున అగ్రిగోల్డ్ ఏజెంట్స్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని ఏపీలోని ఎమ్మెల్యేలు అందరికీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది . మరియు గుంతకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అసెంబ్లీకి వెళ్లినందుకు వారు అందుబాటులో లేనందుకు వారికి ఈమెయిల్, వాట్సాప్ ద్వారా మా వినతి పత్రాన్ని పంపించడం జరిగింది కావున ఎమ్మెల్యే మన గుంటకల్ నియోజకవర్గంలో 12 వేల కుటుంబాలు అగ్రిగోల్డ్ బాధ్యులు వున్నారు .ఆ కుటుంబాల్ని ఆదుకోవాల్సిన బాధ్యత మన ఎమ్మెల్యే పై ఉన్నది కావున ఈ విషయంపై అసెంబ్లీలో గళ్ల%శీ% విప్పాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ మరియు సిపిఐ నాయకులు కోరుతున్నాము ఈనెల 24 వతేది సోమవారం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఈవ్వబోతున్నాం. అగ్రిగోల్డ్ కస్టమర్స్ నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, పుల్లయ్య, ధనుంజయ సిపిఐ నాయకులు కుల్లాయప్ప, ఈశ్వరయ్య ,దేవేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

## ముగిసిన రాజులమ్మ అమ్మవారి యాత్ర

### అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు





**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం దళ్ళవలస గ్రామంలో రెండు రోజుల పాటు కన్నులపండువగా నిర్వహించిన శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి మహోత్సవాలు ఆదివారం తో ముగిశాయి. గ్రామ సర్పంచ్ కిలాన జ్యోతి తిరుమల రావు , రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కిలాన సూర్యారావు ,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో యాత్రా మహోత్సవాలు దిగ్విజయంగా జరిగాయి. ఆమదాలవలస సి. ఐ సత్యన్నారాయణ ,పొందూరు ఎస్. ఐ సత్యన్నారాయణ ప్రత్యేక పర్యవేక్షణ లో పోలీస్ బందో బస్తు ఏర్పాటు తో యాత్ర వేడుకల్లో ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం తో క్యూలైన్లలలో భక్తులు బారులు తీరారు. ఎటువైపు చూసినా క్యూ లైన్లలో ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా యాత్రా కమిటీ మంచినీరు ,తదితర ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఏ దిక్కున చూసిన పండగ వాతావరణం నెలకొంది. ప్రతీ ఒక్కరూ తమ బంధు మిత్రులతో ఆనందోత్సాహాల మధ్య యాత్ర వేడుకలను జరుపుకున్నారు

## గంట్యాడ మండలం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం..




**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు అభ్యర్థి పాకలపాటి రఘువర్మ తరుపున ఆదివారం గంట్యాడ మండలం రామవరం, బుడతనాపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటికి వెళ్ళి ఓటర్లను కలిసి ఎమ్మెల్సీ తెలుగుదేశం అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కొండపల్లి భాస్కర్ నాయుడు, కొప్పలవెలమ డైరెక్టర్ అల్లు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి : ఈఓవోపి ఆర్ డి




**పోడూరు /ఆచంట.ఫిబ్రవరి 23,ప్రజాజ్యోతిన్యూస్.** పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి చారించినట్లు ఈఓపిఆర్డి జి నరసింహారావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలి గ్రామంలో ఆదివారం తడి,పొడి చెత్త పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సచివాల సిబ్బంది టీములుగా ఏర్పడి ప్రజలకు తడి, పొడి చెత్త పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ స్థానికులు తమ ఇంటిలో చెత్తను వేరువేరుగా సేకరించి ఇవ్వాలన్నారు. సేకరించని చెత్తను ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ వద్దకు తర లిస్తామన్నారు . ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం మెరుగు పడాలన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం హనుమంతరావు, డిజిటల్ అసిస్టెంట్, ఎం రవీంద్రబాబు, వెటర్నరీ అసిస్టెంట్, సురేందర్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాల సాయి నవీన్, జూనియర్ అసిస్టెంట్ బి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేనపార్టీ పామిడి ప్రధాన కార్యదర్శి జమీర్ రోషన్ పుట్టిన రోజు



**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి** పామిడి పట్టణంలో జనసేన పార్టీ ప్రారంభించినప్పుడు నుంచి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశాల మేరకు కష్టపడుతూ ఎప్పుడు ప్రజల్లో తిరుగుతూ లయన్ క్లబ్లిసమస్త లో ఒక మెంబర్గా ఉంటూ ఎప్పుడు ప్రజల కోసం కృషి చేస్తూ ఉన్నటువంటి లిజనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి జామీర్ రోషన్ పుట్టినరోజును జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు: వడ్డే రాము, జి కొట్టాల సూర్యనారాయణ, నక్కల రామాంజనేయులు, సూర్య ప్రకాష్,షేక్షావలి,జానకి రాముడు, శరత్ కుమార్, ఖాజావలి, ప్రతాప్, నవీను, శివరాం, తదితరులు పాల్గొన్నారు

# శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ఆర్యవైశ్యులు గీతా వాణి లక్షలు విలువగల మంగళసూత్రం ఇవ్వడం జరిగింది.





**గుంతకల్ టౌన్ ప్రజా జ్యోతి: కసాపురం** శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం నందు ఆర్యవైశ్యులైన పోలాగీతావాణి వారి కుటుంబ సభ్యులుగా విచ్చేసి అమ్మవారికి మంగళసూత్రం దాదాపు1.00.000 లక్ష రూపాయలు విలువగల మాంగల్యం ఇవ్వడం జరిగినది ఆలయ అర్చకులు నందకిషోర్ స్వామి చెన్నకేశవ స్వామి పూజలు నిర్వహించినారు ఆలయ వ్యవస్థాపకులు తలారి పరుశు రాముడు శకుంతలమ్మ దంపతులు గతంలో భక్తులు అందరిని భాగస్వాములు చేయాలని 521 ఒక్క రూపాయి చెప్పగా భక్తులు అందరూ కలిసి ఒక మంగళసూత్రం ఇవ్వగా ఇప్పుడు 2 వ మంగళ సూత్రం పోలా గీతా వాణి ఇవ్వడం జరిగినది వారికి వారి కుటుంబానికి ఆ లక్ష్మీనారాయణ స్వామి దివ్య ఆశీస్సులు ఉండాలని ఆ దేవున్ని కోరుకుంటూ స్వామి వస్త్రముతో శాలువాతో సన్మానించి స్వామి అమ్మవారితీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగినది ఆలయ కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది అనంతరం అన్న ప్రసాద వితరణ పోలా గీతావాణి చేతుల మీదుగా జరిగినది ఈ కార్యక్రమంలో అన్నదాన సేవకులు ఆలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకొని పట్టణ పల్లె ప్రజలందరికీ మహా భాగ్యంగా భారతదేశం నందు ఉన్న పవిత్ర వివిధ నదుల గంగ యమునా సరస్వతి త్రివేణి మానస సరోవరం నుండి జలాలను మరియు 144 సంవత్సరాలు ఒక్కసారి వచ్చే మహా కుంభమేళ గంగాజలాలను తీసుకురావడం జరిగినది అలాగే శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా నర్మదా బాణలింగ మధు వర్ణం సాలిగ్రామ్ కాశీ శివలింగం ఏర్పాటు చేయడం భక్తాదుల స్వహస్తాలతో వివిధ గంగా జలాలు తీర్థాలతో ఆవు పాలతో మహా శివునికి అభిషేకాలు భక్తుల చేతుల మీదుగా చేయించబడును ప్రతి ఒక్కరికి చిన్న కలశాలతో ఈ గంగా జలమును ఇవ్వబడును

# "విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్ దగ్గర కృష్ణ హాస్పిటల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం







**విజయవాడ వెస్ట్ ప్రజా జ్యోతి రిపోర్టర్ చంద్రశేఖర్** ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ:- కృష్ణ హాస్పిటల్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి మానవీయ కోణం జోడించి ఇక్కడికి వచ్చే వారికి సేవలు అందించాలని కోరుకుంటూ ఆసుపత్రి సిబ్బందికి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియచేయటం జరిగింది... గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేయడంతో పాటు ఇటువంటి ఇటువంటి అధునాతనమైనటువంటి అధునాతనమైనటువంటి ప్రజలకు సేవలు అందించాలని లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆస్పత్రులను కూడా పూర్తిస్థాయిలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సహకరించకపోవడంతో ఇటువంటి ఆస్పత్రులను కూడా అనేక రకాలుగా ఇబ్బందులకు గురై ఒకపక్క వైద్యులు మరొక పక్క యాజమాన్యం ఇక్కట్లు పడిన సందర్భాలు అనేకం చూసామని.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడు మాసాల కాలంలో పేదలకు ప్రభుత్వ పరముగా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయటంతో పాటు నేడు కాలమాన పరిస్థితులలో వస్తున్నటువంటి అంతు చిక్కనటువంటి వ్యాధులకు ఇటువంటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నైపుణ్యం కలిగినటువంటి వైద్యులు ఉండటంతో రోగులకు అన్ని రకాలైనటువంటి వైద్యాలు చేసి నయం చేస్తున్నటువంటి పరిస్థితులు మనం అనేకం చూసాం, అటువంటి వైద్యశాలలలో ఈ వైద్యశాల కూడా ప్రజలందరికీ వైద్యంతోపాటు సేవలందించాలని డాక్టర్లు యాజమాన్యం నూతనంగా ఏర్పాటు చేయడం అది నా నియోజకవర్గంలో చేయటం అభినందించదగినటువంటి అంశం అని ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యానికి డాక్టర్లకు తగు సూచనలు చేస్తూ పేదలు మధ్యతరగతి ప్రజలు వివిధ వ్యాధులతో మీ దగ్గరకు వైద్యం కోసం వస్తే వారి ఆర్థిక స్థితిగతులను చూసి సహకరించాలని కోరారు.. గద్దె రామ్మోహన్ గ,అరిమిల్లి రాధాకృష్ణ పాల్గొనడం జరిగింది..

# డ్రోన్స్ తో నేరాలకు చెక్ పెడుతున్న జిల్లా పోలీసులు.

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్





**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** శివార్లలోని నిశిత ప్రాంతాలపైన, రద్దీ ప్రాంతాల్లోను, పండగల్లో నిఘా పెట్టేందుకు డ్రోన్ని వినియోగిస్తున్న జిల్లా పోలీసుశాఖ జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో నేరాల నియంత్రణకు డ్రోన్స్ ను వినియోగిస్తున్న జిల్లా పోలీసులు. ఈవ్ టీజింగ్స్, చైన్ స్నాచింగ్స్, ఓపెన్ డ్రింకింగు, కోడి పందాలను నియంత్రించుటకు డ్రోన్స్ వినియోగిస్తున్నామన్న జిల్లా ఎస్పీ. జిల్లాలో నేరాలను నియంత్రించుటలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న శివారు ప్రాంతాలను, రద్దీ ప్రాంతాల్లోను, పండగల్లో నిఘా పెట్టేందుకు, ఈవ్ టీజింగు, ఓపెన్ డ్రింకింగ్, కోడి పందాలను, చైన్ స్నాచింగ్స్ ను నియంత్రించేందుకు డోన్స్ ను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఫిబ్రవరి 23న అన్నారు. జిల్లాలో నేరాలను నియంత్రించుటకు సాంకేతిక పరిజ్ఞానాన్ని, డ్రోన్స్ ను వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, కోడి పందాలు, ఓపెన్ డ్రింకింగ్, పేకాటలు, వాహనాల రాకపోకలు, పండగల్లో రద్దీని క్రమబద్ధీకరించేందుకు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ ను పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడులను నియంత్రించేందుకు, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ ను వినియోగించి, నేరాలను కట్టడి చేస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం పట్టణంలోని జె.ఎన్.టి.యు., కలెక్టరేట్ జంక్షన్, కే.ఎల్. పురం, మయూరి కూడలి, ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వే స్టేషను, ఆర్టీసి కాంప్లెక్స్, తోటపాలెం, బాలాజీ జంక్షన్ వంటి ప్రాంతాలను, కళాశాలల వద్దకు వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్స్ ను పంపి, ఆయా ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేసామని ఈవ్ టీజింగు, చైన్‌ల స్నాచింగ్స్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అదే విధంగా, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజను ప్రాంతాల్లో రహదారి ప్రమాదాలు జరిగేందకు అవకాశమున్న బ్లాక్ స్పాట్స్, ఇతర నేరాలైన చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, పేకాటలు, కోడి పందాలు, పండగల్లో రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఇతర నేరాలు జరిగేందుకు అవకాశమున్న ప్రాంతాలకు పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్స్ ను పంపి, ఆయా ప్రదేశాలపై నిఘా ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో డ్రోన్స్ ను వినియోగిస్తూ ఓపెన్ డ్రింకింగు చేసిన వారిపై 3400 కేసులు, మద్యం సేవించిన వాహనాలు నడిపిన వారిపై 907కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## పేదలను విస్మరిస్తే అదోగతే సిపిఐ పట్టణ కార్యదర్శి పి. బాలు




**బద్వేల్ ఫిబ్రవరి. 23 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ రూరల్ సి.కొత్తపల్లె లోని చంద్ర రాజేశ్వరరావు నగర్ నందు భారత కమ్యూనిస్టు పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 3వ రోజు రిలే నిరాహార దీక్షలను బద్వేల్ పట్టణ కార్యదర్శి పి. బాలు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలు నిలువ నీడలేక ఎర్రజెండా చేతబట్టి ప్రభుత్వ స్థలాలు నందు నివాస స్థలాలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న తరుణంలో ప్రభుత్వం కక్ష పూరితంగా పేదలపై కన్నెర్రజేసి గుడిసెలను కూల్చాలనుకోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. సర్వే నెంబర్ 1 నుండి 90 వరకు భూకబ్జాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ ఆక్రమణల కారణంగా కోట్లాది రూపాయలు చేతులు మారాయని పేదవాడికి రెండు సెంట్లు స్థలం కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 3.వ రోజు రిలే నిరాహార దీక్షలలో (1) ఎస్. రాజమ్మ.(2) కె.రామ లక్ష్మమ్మ. (3) బి. పెంచలమ్మ(4) ఏ. వెంకట లక్ష్మమ్మ.(5) ఏ. శుభాన్ భి(6) వై లక్ష్మి దేవి (7) కే.విజయమ్మ (8)పి. నాగసుబ్బయ్య (9)డి. భాగ్యమ్మ (10)జి. ఎల్లమ్మ.(11) ఎన్ .పిరాంబి (12)ఎల్. రమణమ్మ (13)జి. రమాదేవి(14) జి. గంగి నాయుడు (15)వై. పెద్దయ్య(16) బి .శ్రీనివాసులు(17) జి. బాలిరెడ్డి (18)బి .నారాయణ(19) బి. లక్ష్మిరెడ్డి (20)బి .సింహాద్రి(21) సి .బాలకొండయ్య(22) సి. రమణయ్య (23)ఎస్. మల్లేష్. పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు పొంగూరు నాగరాజు.నాయకులు చేజర్ల రవి .వెంకటేష్. నవీన్ రాయల్. రామసుబ్బారెడ్డి. నరసయ్య. మహేష్ .తదితరులు పాల్గొన్నారు,

## ఆర్ఆర్ రమేష్ అన్నకు పుట్టినరోజుజన్మదిన శుభాకాంక్షలు




**ప్రజా జ్యోతి రిపోర్టర్ సుబ్బు పామిడి**
ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న మా తమ్ముడు రాయదుర్గం జన్మదిన శుభాకాంక్షలు ఇలాంటివి తమ్ముడు మరెన్నో జరుపుకోవాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. నీవు ఎక్కడికి వెళ్ళినా విజయాలు నీ దగ్గరికి రావాలని పోయిన సంవత్సరం మీకు మీ జీవితంలో ఏదైతే దూరమైందో ఆ పనులన్నీ ఈ నూతన పుట్టినరోజు సందర్భంగా అవన్నీ నీ దగ్గరకు రావాలని ప్రతి ఒకటి విజయం వంతం కావాలని నీవు ఎక్కడికి వెళ్లినా విజయాలతో తిరిగి రావాలని కోరుకుంటూ నీకు ఆయురారోగ్యాలు ఆ దేవుడు ప్రసాదించాలని మీ కుటుంబం అంతా చల్లగా ఉండాలని మరొకసారి కోరుకుంటూ మా మిత్రుడు రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలు మీ శ్రేయోభిలాషి పీటర్ విజయ్

## ఇండియా-పాక్ మ్యాచ్ ను వీక్షించిన మంత్రి నారా లోకేష్, ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)




**జయవాడ :** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఇండియా-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ ను ఏసిఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ,విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో వీక్షించారు. మంత్రి నారా లోకేష్,విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) టీమిండియా జెర్సీ లు వేసుకుని మ్యాచ్ ను తిలకించారు. వీరితో పాటు ఈ మ్యాచ్ ను వీక్షించిన వారిలో ఏసీఏ కార్యదర్శి రాజ్యసభ ఎంపి సానా సతీష్, డైరెక్టర్ సుకుమార్ వున్నారు.

## అన్నం పెట్టిన రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం....

రైతుల సమస్యలను పరిష్కరించండి..



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, ప్రతినిధి..** శృంగవరపుకోట నియోజకవర్గ శాసన సభ్యులు కోళ్ల లలిత కుమారి ఆంధ్రప్రదేశ్ జీడి రైతుల సంఘం ఆధ్వర్యంలో జీడి రైతులసమస్యలపైవినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గంప కృష్ణ మూర్తి వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడుతూ జీడిపంట గిట్టుబాటు ధర లేక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు అందుకని రాష్ట్రంలో సముద్రపు తీర్పురాంతన్న అటవీ ప్రాంతాల్లో గిరి పుత్రులు జీడిరైతులుజీడిపంట అపారంగాపండిస్తున్నారురాష్ట్రంలో సుమారు లక్ష 80 వేల హెక్టర్ల జీడిపంట సాగు చేస్తున్నారు రైతన్నలు పంట కోసం పెట్టుబడి పెట్టి దళారుల చేతుల్లో మోసపోతున్నారు జీడిపిక్క రైతన్నలు సుమారు రెండు లక్షల మంది రైతులు ఈ పంటపై ఆధారపడి ఉన్నరు వీరి పంటకి పాలక ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారిల చేతుల్లో మోసపోతున్నారు అందుకని 80 కేజీల జీడి బస్తా కి16 వేల రూపాయలు మద్దతు ధర ఇవ్వాలి అలాగే గిరిజన రైతులు పండించే జీడిపిక్కలు కొనుగోలుకు జిసిసి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి గిరిజన రైతులు పండించే అన్ని రకాల పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి జీడిపంట అభివృద్ధి ఏర్పాటు చేసి జీడిపంట విస్తరణ మరియు నిర్వహణకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలి జీడి పరిశోధనా కేంద్రాలను ప్రాంతాలవారీగా ఏర్పాటు చేయాలి నాణ్యమైన జీడి పై పరిశోధనలు జరగాలి నాణ్యమైన జీడి మొక్కలు పంపిణీ చేయాలి జీడి పండే ప్రాంతాలలో జీడిపల్లురసం తీసే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి అని అన్నారు ఈకార్యక్రమంలోపాల్గొన్న వారి పేర్లు రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్ శ్రీను బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ లీడర్ తరిణి వెంకటరమణ కరణం కనకారావు తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన గ్రూపు 2 మెయిన్ పరీక్షలు..

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్..**

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** గ్రూపు 2 అభ్యర్ధులకు ఇబ్బంది కలగకుండా రద్దీ ప్రాంతాల్లో డ్రోన్స్ తో ట్రాఫిక్ రెగ్యులేషను చేసిన జిల్లా పోలీసులు. గ్రూపు 2 మెయిన్స్ నిర్వహించే పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాఎస్పీ ఆదేశాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. ఎపిపిఎస్సీ గ్రూపు 2 మెయిన్ పరీక్షలు నిర్వహించిన జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఫిబ్రవరి 23న తెలిపారు. గ్రూపు 2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు నిరసనలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం జిల్లాలో ఎపిపిఎస్సీ గ్రూపు2 మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తున్న జె.ఎన్.టి.యు., సీతం, ఎం.వి.జి.ఆర్.పి.జి. కాలేజ్, ఎం.ఆర్.ఫార్మశీ, ఎం.ఆర్.అటానమస్, శ్రీ చైతన్య డిగ్రీ, ఆర్.కే.డిగ్రీ, గాయత్రీ డిగ్రీ, లెండీ, ఎ.జి.ఎల్. కళాశాలల వద్ద పటిష్ట బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఒక్కొక్క పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ స్థాయి అధికారితో సహా ఇతర సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు. పరీక్షా కేంద్రాలను 7రూట్లుగా విభజించి, ఒక్కొక్క రూటులో ఒక సిఐని పర్యవేక్షణ అధికారిగా నియమించి, పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, భద్రత చర్యలు చేపట్టామన్నారు. పరీక్షా కేంద్రాలకు పేపర్లు తరలింపు, పరీక్ష పూర్తయిన తరువాత పేపర్లను స్ట్రాంగు రూంకు తరలించేందుకు ఆర్మ్ పోలీసులను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్, ఫోటో స్టూడియోలను పరీక్ష ముగిసే వరకు మూసివేయించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మఫ్టీలో పోలీసులను నియమించి, ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించామని, అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే వారిని పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించామన్నారు. పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీసు జరగకుండా పరీక్షలకు ఇన్విజిలేషనుగా నియమించిన అధికారులు, అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోనులు తీసుకొని పరీక్షా కేంద్రాలకు వెళ్ళకుండా చర్యలు చేపట్టామన్నారు. పరీక్షా కేంద్రాలకు చుట్టు ప్రక్కల ప్రాంతాలను డ్రోన్స్ నిఘా పెట్టామన్నారు. పరీక్షా కేంద్రాలకు వెళ్ళే మార్గాల్లో అభ్యర్థులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల రాకపోకలు, రద్దీని డ్రోన్స్ పర్యవేక్షించామని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో గ్రూపు 2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గ్రూవు 2 మెయిన్స్ పరీక్ష నిర్వహణను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో సిఐలు ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, సిహెచ్. షణ్ముఖరావు, ఈ.నర్సింహమూర్తి, ఎన్.వి.ప్రభాకరరావు, బి. లక్ష్మణరావు, జి. రామకృష్ణ, ఆర్ఐ టి.శ్రీనివాసరావు మరియు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది భద్రత విధులను నిర్వహించారు.






# ఇసుక ర్యాంపు వద్ద ఘర్షణ





ర్యాంపు పరిశీలనకు వెళ్లిన వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ నేత చింతాడ రవికుమార్

**అడ్డుకున్న అక్రమ ఇసుక మాఫియాదారులు**

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం బొడ్డేపల్లి గ్రామ ఇసుక ర్యాంపు వద్ద ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే సింగూరు , బొడ్డేపల్లి ,నెల్లిమెట్ట గ్రామాలలో ఇసుక ర్యాంపు లను నిర్వహిస్తున్నారు. ఈ ర్యాంపులని పరిశీలించేందుకు వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ పలువురు వైసిపి నాయకులతో కలిసి ఆదివారం వెళ్లారు. ఉదయం 9:30 గంటలకు బొడ్డేపల్లి ఇసుక ర్యాంపు కు చేరుకున్న చింతాడ ను అరకిలోమీటరు దూరం లోనే ట్రాక్టర్ డ్రైవర్లు , బొడ్డేపల్లి ,సింగూరు , నెలిమెట్ట గ్రామాలకు చెందిన టిడిపి నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరుపార్టీల నేతల మధ్య తోపులాట జరిగి, ఘర్షణ చోటుచేసుకుంది.గత వైసిపి ప్రభుత్వ హయంలో ట్రాక్టర్ ఇసుక రూ. 6 వేలకు గాని లభించేది కాదని , ఇప్పుడు ట్రాక్టర్ ఇసుక ఉచిత ఇసుక విధానం వలన కేవలం రూ 1500 లకే లభిస్తుందని ఈ విషయాన్ని ఎందుకు రాజకీయం చేస్తున్నారని చింతాడను ప్రశ్నించారు. దీంతో అక్రమ ఇసుక మాఫియా దాడికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని చింతాడ వెనుతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి యద్దెచ్చగా టిడిపి నేతలు అక్రమ ఇసుక రవాణా కు పాల్పడుతున్నారన్నారు. ఇసుక త్రవ్వకాలను పరిశీలించేందుకు వెళ్లిన వైసిపి నేతలపై కర్రలు , గడ్డ పారలతో ఇసుక మాఫియా దాడికి యత్నించారని ఆయన ఆరోపించారు. ఉచిత ఇసుక అని మాయ మాటలు చెప్పి కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా నాయకులకు ఇసుకను పంచి పెడుతుందన్నారు. నిబంధనలను విరుద్ధంగా టిడిపి నేతలు కోట్ల రూపాయలలో ఇసుక త్రవ్వకాలు జరుపుతున్న రెవెన్యూ ,మైనింగ్ అధికారులు పట్టించుకోరా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతాడ రవికుమార్ తో పాటు వైకాపా జిల్లా అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ , బొడ్డేపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి రమణా రావు , పైడి నాగభూషణం పలువురు వైసిపి నాయకులు , కార్యకర్తలు ఉన్నారు

## ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రానికి కంప్యూటర్ లు బహూకరణ..



**ఏలూరు,ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** నేటి తరం, రాబోయే తరాలకు కంప్యూటర్ విజ్ఞానం ప్రాధాన్యత గుర్తించి ఎ వి ఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ సౌకర్యం అందరూ బాగా వినియోగించు కోవాలని హేలాపురి బాలోత్సవం చైర్మన్ అడుసుమిల్లి నిర్మల అన్నారు.ఎ వి ఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి సర్ సి ఆర్ రెడ్డి మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సి అరుణ కుమారి రెండు కంప్యూటర్ లను అందజేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ఆధ్వర్యంలో అడుసుమిల్లి నిర్మల, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు లు రెండు కంప్యూటర్ లను స్వీకరించారు. అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ అనేకమంది సహాయ సహకారాలతో నడుస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో కేవలం 500 రూపాయల తోనే ఉపాధికి తోడ్పాడే శిక్షణ ఇవ్వబడుతోంది అని ఎక్కువ మంది ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎం ఎస్ ఎన్ లక్ష్మి ప్రిన్సిపాల్ గా ఈ కేంద్రంలో ఎం ఎస్ ఆఫీస్, డి టి పి, ఫోటోషాప్, టాలీ కోర్సులు నేర్పబడుతున్నాయి అన్నారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 8వ తరగతి ఆ పైన చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు కంప్యూటర్ లు శిక్షణ కేంద్రానికి అందజేసిన అరుణ కుమారి కి కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి..



**కైకలూరు, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో కలిదిండి గ్రామం లో వేంచేసి ఉన్న శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కైకలూరు రూరల్ ఇన్స్పెక్టర్ వి. రవికుమార్ పేర్కొన్నారు. భక్తులు ప్రతి ఒక్కరూ పాతాళ భోగేశ్వర స్వామి దర్శనం చేసుకునేలాగా క్యూ లైన్ లు ఏర్పాటు చేయాలని సూచించారు.కలిదిండి ఎస్ఐ వి వెంకటేశ్వరరావు తో సీఐ కలిదిండి లో రెవెన్యూ, దేవదాయ శాఖ, ఫైర్, ఫిషరీస్, శానిటరీ, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ మహా శివరాత్రి పండుగ నేపథ్యంలో అధిక సంఖ్య లో భక్తులు విచ్చేస్తారని, ఈ నేపథ్యంలో దేవాలయ ప్రాంగణంలో భక్తజన సందోహానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా, తోపులటలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన క్యూ లైన్ లను ఏర్పాటు చేయాలని సూచించారు.

వివిధ ప్రాంతాల నుండి ప్రభలను దేవాలయ ప్రాంగణాలకు వచ్చేమార్గాలను ముందుగా పోలీసు లకు తెలియజేయాలని ప్రభలను నిర్దిష్టమైన ప్రదేశాలలో మాత్రమే ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు.తెప్పోత్సవం నిర్వహించే కోనేరు ప్రాంతాలలో ప్రజలు పలు జాగ్రత్తలను తీసుకోవాలని ప్రజలందరూ కోనేటి లోకి దిగకుండగా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు.డ్రోను సీసీ కెమెరాల,పర్యవేక్షణతో ట్రాఫిక్కుకు ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## పుణ్యగిరి యాత్రికులకు ప్రత్యేక బస్సులు :



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** పుణ్యగిరి జాతర సందర్భంగా ఈ నెల 26 వ తేది బుధవారం ఉదయం 04.30 గంటల నుండి 27 వ తేదీ గురువారం సాయంత్రం వరకు ఎస్. కోట నుండి పుణ్యగిరికి మరియు సన్యాసయ్యపాలెం లో వెలసిన సన్యాసయ్య గుడి కి యాత్రికుల కొఅకు ప్రత్యేక బస్సులు నడుపుచున్నట్లు డిపో మేనేజర్ శ్రీ కె. రమేష్ గారు ఒక ప్రకటన లో తెలియ పరచి నారు. ఈ ప్రత్యేక బస్సులు ఉదయం 04.30 గంటల నుండి నడుపబడును. ఎస్. కోట నుండి పుణ్యగిరి కి 15 బస్సులు మరియు సన్యాసయ్యపాలెం నకు 3 బస్సులు మొత్తం 18 బస్సులు నడుపుతామని తెలియచేసారు. యాత్రికుల సౌకర్యార్థం 26 వ తేదీ బుధవారం రాత్రి మొత్తం ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయని,యాత్రికుల రద్దీ ని బట్టి బస్సులు పెంచబడుననియూ అంతే కాకుండా యాత్రికుల సౌకర్యం కోసం దేవిగుడి వద్ద మరియు పుణ్యగిరి కొండ వద్ద కూడా ఆర్టీసీ వారిచే 24 గంటలూ సమాచార కేంద్రాలు ఏర్పాటు చేస్తామని స్థానిక డిపో మేనేజర్ శ్రీ కె. రమేష్ గారు తెలియ పరచి నారు. కావున భక్తులు ఈ సదవకాశా న్ని వినియోగించు కోవలసినది గా రమేష్ తెలియ పరచి నారు.

## హక్కుల కొసం పోరాడే

**విజయగౌరి ని గెలిపించండి..**





ప్రవేట్ కాలేజ్ ఉపాధ్యాయులను కోరిన సీఐటీయూ జిల్లా నేత చల్లా జగన్ విజయనగరం జిల్లా, వేపాడ మండలం, ప్రజా జ్యోతి న్యూస్: ప్రతినిధి:ల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి , ఉద్యమ నేత, హక్కుల కోసం నిత్యం పోరాడే విజయగౌరి ని గెలిపించాలని ప్రచారలో %ఖుఖీ% నాయకులతో కలసి సీఐటీయూ నాయకుడు చల్లా జగన్ ఓటర్లలను అభ్యర్థించారు ఈరోజు మండలలోని బొద్దాం కొత్త బొద్దాం, ఒబలయ్యపాలెం తదితర గ్రామాల్లోని ప్రవేట్ ఉపాధ్యాయ ఓటర్లను కలిసారు ప్రైవేటు ఉపాధ్యాయులకు వేతన బోర్డు సాధన, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు , హెల్త్ కార్డుల మంజూరు ప్రత్యేక ఫంక్షన్ స్కీమ్ కి కృషి , ఉద్యోగ భద్రత చట్టబద్ధ సెలవలకొరకు కృషి చేస్తామన్నారు విజయగౌరి విద్యార్థి దశ నుండే ఎస్ఎఫ్ఐ ఉద్యమాల్లో కీలకంగా పనిచేసారని. ఉపాధ్యాయ వృత్తి ప్రారంభ రోజుల నుండి నేటి వరకు యూటీఏఫ్ సంఘంలో కీలకంగా పని చేశారు, యూటీఏఫ్ చేసే పోరాటంలో ముందు బాగా నిలిచారు అన్నారు పెద్దల సభకు అధికార పక్షానికి అనుకూలంగా ఉన్న, వారి మద్దతుతో గెలిచిన ఎమ్మెల్సీలు ఉపాధ్యాయుల సమస్యలు మాట్లాడే ప్రసక్తే ఉండదన్నారు విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి ని పెద్దల సభ పంపాలని కోరారు ఈ ప్రసార కార్యక్రమంలో

## మండల ప్రధాన కార్యదర్శి ఇమంది.జగదీశ్వర రావుతో నాయకులు ఎం సతీష్ ఊపాద్యాయులు పాల్గొన్నారు.

**తుది శ్వాస విడిచిన శాంతారాం మాష్టారు** – ప్రముఖ సంఘ సంస్కర్తగా ఎనలేని గుర్తింపు



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రముఖ సంఘ సంస్కర్త , యంగ్ స్టార్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్ళ కూరి శాంతారాం ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెంది తన తుది శ్వాస విడిచారు. పొందూరు పట్టణం తో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల వారితో సాన్నిహిత్యం గా ఉండే ఆయన అందరికీ సుపరిచితులు. సంఘ సంస్కర్త గానే కాకుండా ,ఉపాద్యాయ సంఘ ప్రతినిధిగా ,పొందూరు పైడితల్లి ట్రస్టు వ్యవస్థాపక సభ్యులుగా అమ్మవారి ఆలయానికి విశేష సేవలు అందించారు. రెడ్ క్రాస్ రాష్ట్ర సభ్యునిగా సేవా కార్యక్రమాల్లోనూ , రక్తదాన శిబిరాలు నిర్వహించి గుర్తింపు పొందారు.ప్రభుత్వ ఉపాధ్యాయుడిగానూ ,రంగస్థల కళాకారుడిగా ఉత్తమమైన సేవల్ని అందించారు.ప్రభుత్వం రాత్రి బడులు నిర్వహించక ముందే పొందూరు లో భవన నిర్మాణ కార్మికుల కోసం , రిక్షా పుల్లర్ల కోసం రాత్రి బడుల నిర్వహణ లో పాలు పంచుకుని ఎంతోమందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లో కీలక పాత్ర పోషించారు. పొందూరు గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి యాత్రను ప్రారంభించి 40 ఏళ్లుగా నిర్విరామంగా నిర్వహించడంలో ఆయన పాత్ర కీలకం. పొందూరు పైడితల్లి ఆలయ పున నిర్మాణం కోసం అమ్మవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించడంతో పాటు ఆలయ అభివృదికి అహర్నిశలు కృషి చేశారు. 70 ఏళ్ల వయస్సు లో కూడా చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో అగ్ని ప్రమాదాల బాధితుల కోసం ,దేశంలో విపత్తుల వలన నష్టపోయిన బాధితుల కోసం విరాళాలు సేకరించి బాధితులకు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈయన మరణ వార్త తెలిసిన ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే,పి. యూ సి చైర్మెన్ కూన రవికుమార్ ,మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , మేజర్ పంచాయతీ సర్పంచ్ రే గిడి లక్ష్మీ ,ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి ,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , అనకాపల్లి శివ కుమార్ , దండా రవి ,కుమిలి రాజేష్ , వైఎస్సార్సీపీ కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు , అనకాపల్లి గోవింద్ ,ఎ.ఎం.సి మాజీ ఛైర్మెన్ బాడాన సునీల్ , అల్లం శెట్టి గిరి , రాంబిల్లి నాగరాజు ,పాత్రికేయులు బెవర ఆంజనేయులు , రాయిపిల్లి రాంబాబు ,పలు పార్టీల నాయకులు , పట్టణానికి చెందిన ప్రముఖులు ,పట్టణ వాసులు ,ఉపాద్యాయులు శాంతా రాం మాష్టారు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన ప్రసన్న శ్రీ కి అభినందనలు...

**జనవిజ్ఞాన వేదిక వెదుళ్ళపల్లి పరిసర గ్రామాల సమైక్య ఆధ్వర్యంలో ప్రసన్న శ్రీ కు శుభాకాంక్షలు..**



**బాపట్ల జిల్లా ఫిబ్రవరి 23:- (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** జన విజ్ఞాన వేదిక వెదుళ్ళపల్లి పరిసర గ్రామాల సమైక్య ఆధ్వర్యంలో ఆదివారం వెదుళ్ళపల్లి చైతన్య భవన్ హాల్ నందు జరిగిన సమావేశంలో వైస్ ఛాన్సలర్ గా నియమితులైన ప్రసన్న శ్రీ కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్టువర్టు పురం చెందిన దేవరకొండ రాము అధ్యక్ష వహించి. మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన ప్రసన్న శ్రీ విశ్వవిద్యాలయ వీసీగా ఎదగటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రసన్న శ్రీ సర్దార్ పటేల్ యూనివర్సిటీలో పిహెచ్ డి చేశారు. ఆ తర్వాత పద్మావతి విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా రెండు దశాబ్దాల పాటు పని చేశారన్నారు. ప్రస్తుతం రాజమండ్రిలో వైస్ ఛాన్సలర్ గా 2025లో నూతన ప్రభుత్వంలో నియమించటం పట్ల ఆయన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. 25 ఏళ్ల క్రితం గ్రామం పంచాయతీలోని స్టువర్టుపురం కూడా ఒక భాగముగా ఉందన్నారు. పంచాయతీ పునర్వ్యస్కరణ అయింది అని కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కల వెంకటేశ్వర్లు ఎస్.కె సుభాని మిరియాల సుబ్బారావు, కావూరి శ్రీనివాస్ రెడ్డి, సీతారామయ్య, బి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ముదునూరి..



**రాజమహేంద్రవరం ఫిబ్రవరి 23:- (ప్రజా జ్యోతి ప్రతినిధి)** రాజమహేంద్రవరం జిల్లా అనపర్తి నియోజకవర్గం నల్లమిల్లి వారి రిసెప్షన్ వేడుకకు హాజరైన మురళీరాజు అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి రిసెప్షన్ వేడుకలలోఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు పాల్గొన్నారు అనంతరం వధూవరులను ఆశీర్వదించారు
ఈ కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## పుట్టినరోజు వేడుకలలో ముదునూరి..



**గొల్లప్రోలు(ప్రజా జ్యోతి) రిపోర్టర్ చిన్నబాబు..** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం సతీష్ కుమారుడు పుట్టినరోజు వేడుకలో మురళీ రాజు పాల్గొన్నారు మాధపురం గ్రామం చెందిన రామినీడి సతీష్,సూర్య కళ దొడ్డిపట్ల కృష్ణ మనవడు ఆదివారం పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారుని ఆశీర్వదించిన ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు మాచర్ల దాసు కోలా తాతబాబు జువ్వల సత్యనారాయణ బొల్లు నాగేశ్వరరావు జువ్వల దొరబాబు చేకూరి రాంబాబు రాజు పోకనాటి వెంకటేశ్వరరావు కిల్లాడి బాబ్జి బొల్లు సత్తెలు తూపాటి బాబ్జి కోన బాబ్జి మాచర్ల రాజు గుమ్మిడి రామకృష్ణ సిద్ధ అప్పలరాజు దాడి పుత్రయ్య దోమలంక బాబ్జి నల్ల వెంకటేష్ దాడి శీను కేసరపు శ్రీను నానిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు

## కోడిపందాల స్థావరంపై దాడి..



**టీ నర్సాపురం, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** టీ నర్సాపురం ఎస్సై జై బాబు కి అందిన సమాచారం మేరకు టీ నర్సాపురం ఎస్ఐ సిబ్బంది,పీరియర్సాపురం మండలం కృష్ణాపురం గ్రామం శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా 13 వేల రూపాయల నగదు ఒక కోడిపుంజును స్వాధీన చేసుకున్నారు.

# ప్రతి గ్రామానికి రోడ్లు వేస్తున్నాం





**- సీసీ రోడ్లకు జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత**

**- ఇళ్లు, ఇళ్ల పట్టాలు త్వరలోనే అందిస్తామని ఎమ్మెల్యే సునీత హామీ**

**- సదాశివకాలనీకి సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ అందిస్తామన్న సునీత**

**అనంతపురం ఫిబ్రవరి 23:** రాప్తాడు నియోజకవర్గంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామానికి రోడ్డు వేస్తామని రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత అన్నారుముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన ఈ ప్రభుత్వంలో ఏ గ్రామంలో కూడా రోడ్డు సమస్య లేకుండా చేస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయితీలోని మధురానగర్, సదాశివనగర్ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఒక్కో కాలనీకి 25లక్షల చొప్పున మొత్తం 50లక్షల నిధులు మంజూరు కాగా వాటికి సంబంధించిన పనులను ఎమ్మెల్యే సునీత ప్రారంభించారు. సదాశివకాలనీకి సంబంధించిన వారు ఎమ్మెల్యే వద్దకు తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇక్కడ 250 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకున్నారని.. వీటికి ఇంటి పట్టాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటికి పట్టాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే కాలనీలో ఉన్న మిగిలిన వారికి కొత్తగా ఇంటి స్థలాలు, ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. అంగన్వాడీ స్కూల్ కు నూతన భవనం నిర్మిస్తామన్నారు. పింఛన్లు, రేషన్ కార్డుల సమస్యలు చెప్పగా.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు, రేషన్ కార్డులు త్వరలోనే అందిస్తామన్నారు. మరోవైపు తాగునీటి సమస్య గురించి కాలనీ వాసులు చెప్పగా.. వాటర్ ప్లాంట్ కోసం షెడ్ ఏర్పాటు చేసుకోవాలని, ప్లాంట్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ప్రాంత సమస్యలపై ఎక్కువగా దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇతర మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధి గురించి మచ్చుకైనా ఆలోచించలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రోడ్లు వేస్తామని చెప్పామని.. ఇప్పుడు నూతన రోడ్లతో గ్రామాల్లోకి అడుగు పెడుతున్నామని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## గ్రూప్ టు పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు..



**ఏలూరు, ఫిబ్రవరి 23 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ గ్రూప్ 2 పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.ఏలూరు సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్పీ పరీక్షా కేంద్రాల వద్ద ఉద్యోగ నిర్వహణ చేస్తున్న అధికారులకు దిశ నిర్దేశం చేశారు. నిష్పక్షపాతముగా ఉద్యోగ నిర్వహణ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్దకు హాజరయ్యే 4,415 మంది అభ్యర్థులకు తగిన సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే వారికి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అలాగే పరీక్షా కేంద్రాల సమాచారాన్ని తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి డి శ్రావణ్ కుమార్,ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, ఏలూరు ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులు జింకా చంద్ర శేఖర్



**ధర్మవరం ఫిబ్రవరి 23:** ధర్మవరం పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో చేపట్టిన మన్ కీ బాత్ రేడియో టీవీ కార్యక్రమం 257,258వ బూత్ ల నందు ప్రజలతో కలిసి వీక్షించడం జరిగినది. అందులో భాగంగా వన్యప్రాణులను మనం సంరక్షించుకోవాలి, రానున్న పదవ తరగతి మరియు ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు నరేంద్ర మోడీ వినూత్నంగా ప్రారంభించిన పరీక్ష పై చర్చ కార్యక్రమాన్ని అందరూ తప్పకుండా చూడాలి. పరీక్ష రాసేటప్పుడు టెన్షన్ వదిలి ఆనందంగా పరీక్షలు రాస్తే ఫలితాలు మరింత అద్భుతంగా ఉంటాయని మోదీ తెలియజేశారని చెప్పారు. క్రికెట్ అభిమానులు క్రికెట్ లో సెంచరీ కొడితే ఎంతో సంతోషంగా మనం ఆనందిస్తాము ఇటీవల ఇస్రో ఆధ్వర్యంలో 100వ రాకెట్ను విజయవంతంగా మనం పంపించడం జరిగినది ఆ విషయాన్ని ప్రజలతో పంచుకున్నారు మరియు క్రీడాకారుల యొక్క పోరాట పటిమ గురించి వారితో మాట్లాడించి సందేశాన్ని అందించడం జరిగినది ఈ సందర్భంగా దేశ ప్రజలను తాను ముందుండి నడిపిస్తున్న విశ్వ గురువు శ్రీ నరేంద్ర మోడీ కి ధర్మవరం బీజేపీ పట్టణ అధ్యక్షులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబులేసు,బూత్ అధ్యక్షుడు భాస్కర్, మన్ కి బాత్ నిర్వాహకులు రామాంజి, శీలా ప్రసాదు, ఎల్లపు రామకృష్ణ,మామిళ్ల రంగయ్య , పురుషోత్తం, నరేష్, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పీఎంజేపవై చెక్కుల
# పంపిణీ చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



**- పీఎం అనుచిత్ జాతి అభ్యుదయ యోజన కింద రుణాల మంజూరు**

**- షెడ్యూల్ కులాల వారికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్న సునీత**

**అనంతపురం ఫిబ్రవరి 23:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ప్రధానమంత్రి అనుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంజేఏవై) పథకం కింద రాప్తాడు నియోజకవర్గంలో పలువురు మహిళలకు రుణాలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే సునీత తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లోని షెడ్యూల్ కులాల లబ్ధిదారులకు పీఎంజేఏవై పథకం కింద 8మందికి 12లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఇందులో ప్రతి యూనిట్ కు 50 వేల రూపాయల సబ్సిడీ ఇవ్వనున్నారు. యూనిట్ మొత్తం విలువలో 10శాతం లబ్ధిదారుడు చెల్లించగా.. తక్కిన మొత్తాన్ని యూనిట్ విలువను బట్టి రుణం రూపంలో అందిస్తారు. ఈ రుణం మొత్తాన్ని సున్నా వడ్డీతో 24వాయిదాలలో లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. రుణాల లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతతో పాటు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళా సంఘాలను ఏర్పాటు చేశారని.. ఇది వారిని స్వయం ఉపాధి వైపు నడిపించడమే కాకుండా ఎన్నో రకాలుగా ఉపయోగపడుతోందన్నారు. సంఘాలలోని షెడ్యూలు కులాల మహిళల అభ్యున్నతి కోసం సున్నా వడ్డీతో, సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. మహిళలు తీసుకున్న ప్రతి రుణం ద్వారా వ్యాపారం, ఇతర వాటిల్లో రాణించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో ఇంకా ఎక్కువ మొత్తంలో సబ్సిడీ రుణాలు మంజూరయ్యేలా చూస్తామన్నారు. షెడ్యూల్ కులాల వారికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు....

## నేడు పీజీఆర్ఎస్ రద్దు..



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23(ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 24 సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఆదివారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు మీకోసం పోర్టల్ ద్వారా సచివాలయాల్లో ఆన్లైన్ ద్వారా అర్జీలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పి జి ఆర్ ఎస్ సెషన్‌లకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 24 సోమవారం పీజీఆర్ఎస్ రద్దు చేసామన్నారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం పోర్టల్ లో మీ సమీపంలో ఉన్న గ్రామ వార్డు సచివాలయాల్లో ఆన్లైన్ ద్వారా అర్జీలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.మార్చి 8 వ తేదీ వరకుప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు అమలులో ఉంటుంది అని కలెక్టర్ తెలిపారు.
...

# ఖర్బూజాలు అందించే ఆరోగ్య ప్రయోజనాలు



వేసవి కాలంలో ఎండ వేడి నుంచి తప్పించుకునేందుకు అందరూ చల్లని మార్గాల వైపు చూస్తుంటారు. శరీరాన్ని చల్లగా ఉంచుకునేందుకు చల్లని నీళ్లను తాగడం, కొబ్బరి నీళ్లను తీసుకోవడం లేదా పలు రకాల పండ్లను తినడం చేస్తుంటారు. అయితే ఈ సీజన్‌లో మనకు అనేక రకాల పండ్లు లభిస్తుంటాయి. వాటిల్లో ఖర్బూజా పండ్లు కూడా ఒకటి. ఇవి రుచికి చప్పగా ఉంటాయి. కనుక చాలా మంది వీటితో జ్యూస్ తయారు చేసి అందులో కాస్త చక్కెర లేదా తేనె కలిపి తాగుతుంటారు. ఖర్బూజాలను షుగర్ ఉన్నవారు కూడా తినవచ్చు. కాకపోతే చక్కెర, తేనె ఉపయోగించకూడదు. వీటిల్లో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఖర్బూజాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, కనుక వేసవి సీజన్‌లో ఈ పండ్లను అసలు మిస్ చేయకూడదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**జీవక్రియలు సక్రమంగా..**

ఖర్బూజాల్లో 90 శాతం నీరే ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. వేసవిలో ఈ పండ్లను తింటే వేసవి తాపం నుంచి ఉపశమనం పొందవచ్చు. శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. శరీరం చల్లగా ఉంటుంది. వేడి మొత్తం పోతుంది. ఖర్బూజాల్లో అనేక రకాల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఈ పండ్లలో విటమిన్లు ఎ, సి, బి6 అధికంగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం కూడా ఎక్కువగానే ఉంటాయి. ఖర్బూజాల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఈ పోషకాలు అన్నీ అనేక జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడడానికి ఎంతగానో సహాయం చేస్తాయి. దీంతో మనం అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటాం.

**బరువు తగ్గవచ్చు..**

ఖర్బూజాల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీని వల్ల తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఇవి వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. ఖర్బూజాల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌న నిర్మూలిస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ఖర్బూజాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ క్రియను మెరుగు పరుస్తుంది. మలం పేగుల్లో సులభంగా కదిలేలా చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గిపోతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లలో క్యాలరీలు తక్కువగా, నీటి శాతం అధికంగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారు తమ డైట్‌లో ఈ పండ్లను చేర్చుకోవాఇ. ఇవి ఆహారం అధికంగా తీసుకోకుండా చేస్తాయి. ఆకలిని నియంత్రణలో ఉంచుతాయి. దీంతో బరువు తగ్గడం తేలికవుతుంది.

**గుండె జబ్బులు రావు..**

ఖర్బూజాల్లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఖర్బూజాల్లో విటమిన్ ఎ, బీటా కెరోటీన్ అధికంగా ఉంటాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకుంటాయి. ఇలా ఖర్బూజాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కాబట్టి వేసవి సీజన్‌లో ఈ పండ్లను తినడం మరిచిపోకండి.



# మానసిక ఆరోగ్యానికి అరటిపండు ఎలాంటి మేలు చేస్తుంది?

అరటిపండు పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే పండు. ఇది ఏడాది పొడవునా మార్కెట్లో లభిస్తుంది. అరటిపండు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్ ఏ , మెగ్నీషియం, రాగి మొదలైన అనేక పోషకాలు ఉన్నాయి, ఇవి శరీరానికి శక్తిని అందించ డానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, జీర్ణక్రియను మెరుగుపరచ డానికి, మానసిక స్థితిని సమతుల్యం చేయడానికి, చర్మాన్ని మెరుగు పరచడానికి ఒక అద్భుతమైన ఎంపిక.

**చర్మానికి మేలు..**

అరటిపండులో విటమిన్ సి, ఇతర యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి చర్మాన్ని సంరక్షించడంలో సహాయపడతాయి. ఇవి చర్మాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడుతాయి. అంతేకాకుండా, ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో శరీరం నుంచి హానికరమైన అంశాలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**జీర్ణక్రియ ..**

అరటిపండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇందులో పెక్టిన్ అనే సమ్మేళనం ఉంటుంది, ఇది కడుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి అవసరం..**

అరటిపండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది, ఇది బిపిని నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. పొటాషియం సాధారణ హృదయ స్పందనను నిర్వహిస్తుంది. రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**మానసిక ఆరోగ్యానికి..**

అరటిపండ్లలో విటమిన్ బి6 ఉంటుంది, ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడుతుంది.

# నిమ్మకాయ నీళ్లను తాగుతున్నారా?



అధిక బరువు తగ్గడం ఎంత కష్టంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. బరువు పెరగడం సులభమే. కానీ తగ్గించుకోవడమే కష్టం. 1 కిలో బరువు పెరిగేందుకు 3 రోజులు చాలు. కానీ తగ్గేందుకు 10 రోజులు శ్రమించాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బరువును తగ్గించుకునేందుకు చాలా మంది అనేక రకాల పద్ధతులను పాటిస్తుంటారు. జిమ్‌లో వ్యాయామం చేయడంతోపాటు డైట్ విషయంలోనూ జాగ్రత్తలను తీసుకుంటారు. ముఖ్యంగా బరువును తగ్గించుకునేందుకు పలు ప్రత్యేక పానీయాలను కూడా సేవిస్తుంటారు. అలాంటి పానీయాల్లో నిమ్మకాయ నీళ్లు కూడా ఒకటి. చాలా మంది ఉదయం పరగగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగుతుంటారు. దీని వల్ల శరీర మెటబాలిజం పెరిగి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కానీ నిమ్మకాయ నీళ్లను తాగాలని అనుకుంటున్న వారు పలు సూచనలు పాటించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**ఉప్పు, చక్కెర వద్దు..**

నిమ్మకాయ నీళ్లలో చాలా తక్కువ క్యాలరీలు ఉంటాయి. నిమ్మకాయ నీళ్లను రోజూ తాగడం చాలా సులభం. సింపుల్‌గా నీళ్లను కాస్త వేడి చేసి అందులో నిమ్మరసం, తేనె కలిపి తాగేయడమే. ఈ నీళ్ల వల్ల కేవలం 6 క్యాలరీలు మాత్రమే లభిస్తాయి. అందుకనే బరువును తగ్గించడం కోసం ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. అయితే కొందరు ఈ నీటిలో తేనెకు బదులుగా చక్కెర కలిపి తాగుతుంటారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు ఎట్టి పరిస్థితిలోనూ నిమ్మకాయ నీళ్లలో చక్కెర కలపకూడదు. అలా కలిపి తాగితే ఈ నీళ్లను తీసుకుని కూడా ప్రయోజనం ఉండదు. బరువు తగ్గాలనుకునే మీ కోరిక నెరవేరదు. ఇక కొందరు ఈ నీళ్లలో ఉప్పు కలిపి తాగుతారు. ఉప్పును కూడా కలపకూడదు. ఎండవల్ల మీ శరీరం డీహైడ్రేషన్ బారిన పడితేనే అలాంటి సందర్భంలోనే నిమ్మకాయ నీళ్లలో ఉప్పు, చక్కెర కలిపి తాగాలి. అంతేకానీ బరువు తగ్గడం కోసం ఉపయోగించే నిమ్మకాయ నీళ్లలో ఉప్పు, చక్కెర కలపకూడదు.

**అదే పనిగా తాగకూడదు..**

ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని చెప్పి కొందరు అదే పనిగా ఈ నీళ్లను తాగుతుంటారు. అలా ఎట్టి పరిస్థితిలోనూ ఈ నీళ్లను సేవించకూడదు. రోజుకు 1 లేదా 2 సార్లు తాగాలని మాత్రమే నియమం పెట్టుకోవాలి. అన్నే సార్లు తాగాలి. లేదంటే శరీరంపై నెగెటివ్ ప్రభావం పడుతుంది. నిమ్మకాయ నీళ్లను తయారు చేసేందుకు ఉపయోగించే నీళ్లు చాలా శుభ్రంగా ఉండాలి. అవి ఫిల్టర్ అయిన నీళ్లు అయి ఉండాలి. బయటి నుంచి కొందరు 20 లీటర్ల క్యాన్లను తెచ్చుకుని ఆ నీళ్లను ఉపయోగిస్తారు. ఆ నీళ్లు మంచివే. కానీ ఆ నీళ్లను అయినా సరే ఫిల్టర్ చేయాల్సి ఉంటుంది. లేదంటే నీళ్లతో నిమ్మరసం రసాయన చర్య జరుపుతుంది. అప్పుడు నీళ్లు మారిపోతాయి. అలాంటి నీళ్లను తాగినా ప్రయోజనం ఉండదు.

**గ్యాస్ ట్రబుల్ ఉంటే..**

నిమ్మకాయ ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని చెప్పి కొందరు నేరుగా నిమ్మరసాన్ని సేవిస్తుంటారు. ఇలా చేయడం హానికరం. ఎందుకంటే నిమ్మకాయ రసంలో ఆమ్ల గుణాలు ఉంటాయి. ఇవి దంతాలకు నేరుగా తాకితే దంతాలపై ఉండే ఎనామిల్ పొర కరిగిపోతుంది. దీంతో దంతాలు బలహీనంగా మారుతాయి. పెళుసుగా మారి విరిగిపోతాయి. దంత క్షయం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కనుక నిమ్మరసాన్ని ఎల్లప్పుడూ నీళ్లలో కలిపి మాత్రమే తాగాలి. గ్యాస్ ట్రబుల్ సమస్య ఉన్నవారు ఈ నీళ్లను ఎట్టి పరిస్థితిలోనూ పరగడుపున సేవించకూడదు. ఈ నీళ్లను తాగాలనుకుంటే ఉదయం అల్పాహారం చేసిన తరువాత 40 నిమిషాలు ఆగి ఆ తరువాత తాగవచ్చు. ఆహారం తింటానికి ముందు లేదా తిన్న వెంటనే కూడా ఈ నీళ్లను సేవించకూడదు. లేదంటే మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకోలేదు. ఇలా నిమ్మకాయ నీళ్లను తాగే విషయంలో పలు సూచనలను పాటించాల్సి ఉంటుంది. దీంతో ఈ నీళ్లతో ప్రయోజనాలను పొందవచ్చు.

బిజినెస్

# ఈ మార్కెట్లకు ఏమైంది

## అంబానీ, అదానీ కంపెనీల్లో షేర్లు కొన్న ప్రేమ్‌జీ ఇన్వెస్ట్



ఐటీ దిగ్గజం అజీమ్ ప్రేమ్‌జీకి చెందిన పెట్టుబడుల సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ తాజాగా 9 కంపెనీలలో షేర్లు కొనుగోలు చేసింది. ఈ జాబితాలో భారతీ ఎయిర్‌టెల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ తదితరాలున్నాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఇందుకు రూ. 446 కోట్లకుపైగా వెచ్చించింది. అనుబంధ సంస్థ పీఐ అపార్చునిటీస్ ఏఐఎఫ్‌వీ ఎల్‌ఎల్‌పీ ద్వారా ఎయిర్‌టెల్‌లో 5.44 లక్షల షేర్లు, జిందాల్ స్టీల్‌లో 9.72 లక్షల షేర్లు, రిలయన్స్‌లో 5.7 లక్షల షేర్లు, ఇన్ఫోసిస్‌లో 3.28 లక్షల షేర్లు సొంతం చేసుకుంది. ఈ బాటలో ఐసీఐసీఐ బ్యాంకులో 3.33 లక్షల షేర్లు, హిందాల్కోలో 8.13 లక్షల షేర్లు, అంబుజా సిమెంట్స్‌లో 5.14 లక్షల షేర్లు, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో 1.09 లక్షల షేర్లు, ఎస్‌బీఐ లైఫ్‌లో 84,375 షేర్లు చొప్పున కొనుగోలు చేసింది. ఒక్కో షేరునీ సగటున రూ. 477%-%1,807 ధరల శ్రేణిలో సొంతం చేసుకుంది. టారిష్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడింగ్ కంపెనీ ఈ వాటాలు విక్రయించింది.

కొనసాగుతున్న విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణ రూ.లక్షల కోట్లలో కరిగిపోతున్న మదుపరుల సంపద వరుస నష్టాల్లో సూచీలు.. అదానీ, అంబానీలకు భారీ షాక్‌లు ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.2.5 లక్షల కోట్ల విలువను కోల్పోయిన బడా కార్పొరేట్ సంస్థలు ముంబై, ఫిబ్రవరి 22: భారతీయ స్టాక్ మార్కెట్లు.. మదుపరులకు షాక్ మార్కెట్లుగా తయారవుతున్నాయి. ప్రధాన సూచీలు వరుస నష్టాల్లో కదలాడుతుండటంతో లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోతున్నది మరి. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లోని సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లోని నిఫ్టీ.. రెండింట్లోనూ నమోదైన కంపెనీల విలువ గతకొద్ది రోజులుగా దారుణంగా పడిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.



**ఇదీ సంగతి..**

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ముఖ్య కారణాల్లోకి వెళ్తే.. పలు దేశ, విదేశీ పరిణామాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇజ్రాయెల్-హమాస్ పరస్పర దాడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ఏర్పడ్డ వాణిజ్య యుద్ధం భయాలు, నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్, ఆశించిన స్థాయిలో లేని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్ల తగ్గింపులు, పడిపోతున్న భారత జీడీపీ, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, పడకేసిన పారిశ్రామికోత్పత్తి వంటివి దేశీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులను పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా సెన్సెక్స్ 2,827.95 పాయింట్లు, నిఫ్టీ 848.90 పాయింట్లు కోల్పోయాయి.

**అదానీ టాప్ లూజర్**

ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ సంస్థల స్టాక్స్ విలువ భారీగా పడిపోయింది. 11.9 బిలియన్ డాలర్లు (రూ.లక్ష కోట్లపైనే) హరించుకుపోయింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విలువ 2.94 బిలియన్ డాలర్లు (రూ.25వేల కోట్లపైనే) క్షీణించింది. దిలీప్ సంఘ్వీ, శివ్‌నాడార్, రవీ జైపూరియా వంటి బడా కార్పొరేట్ కంపెనీల విలువ సైతం బాగానే పతనమైంది. అందరిదీ కలిపితే రూ.2.5 లక్షల కోట్లదాకా నష్టం ఉంటున్నది. మరోవైపు ఈ దెబ్బకు బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్‌లో ముకేశ్ అంబానీ స్థానం 17 (87.7 బిలియన్ డాలర్లు)కు, గౌతమ్ అదానీ ర్యాంక్ 23 (66.8 బిలియన్ డాలర్లు)కు దిగజారాయి. అయితే ఇప్పటికీ ఆసియా దేశాల్లోని సంపన్నుల్లో అగ్రస్థానంలో ముకేశ్, ఆ తర్వాత అదానీయే ఉన్నారు.

**ఎఫ్ఐఐలు దూరం**

విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వీలైనంత ఎక్కువగా వెనక్కి తీసుకుంటూనే ఉన్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.78,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ నెల్లోనూ రూ.40,436.17 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.1,18,436.17 కోట్లు వెనక్కి పోయినట్టైంది. ఇక దేశీయంగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్ఐఐల్లో సుమారు 35 శాతం అమెరికాకు చెందినవారే. అగ్రరాజ్యాధినేత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వీరి పెట్టుబడుల ఉపసంహరణలు ఇటీవలికాలంలో పెరిగాయని చెప్పవచ్చు. నిజానికి గడిచిన పదేండ్లలో భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్ఐఐ పెట్టుబడుల వాటా 4 శాతానికిపైగా క్షీణించింది. 2015 జనవరిలో 20.2 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 16 శాతంగా ఉన్నది. ఇది 12 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఎఫ్ఐఐలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోనే ఉంటున్నారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు.

# ఐటీ ఉద్యోగుల జీతాలు ఈసారి ఎలా ఉంటాయంటే..



దేశంలో ఐటీ ఉద్యోగాలకు ) ఎనలేని క్రేజ్ ఉంది. అత్యధిక జీతాలే ఇందుకు కారణం. ఉద్యోగంలో చేరినప్పుడు రూ.లక్షల్లో ప్యాకేజీ లభించడమే కాదు.. ఏటా వేతనాల పెంపు కూడా అదే స్థాయిలో ఉంటుంది. కానీ ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. ఏటా తూతూ మంత్రంగా సింగిల్ డిజిట్‌లోనే జీతాలను పెంచుతున్నాయి ఐటీ కంపెనీలు. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఐటీ పరిశ్రమలో వేతన ఇంక్రిమెంట్లు మధ్యస్థంగా ఉంటాయని అంచనా. ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకులు, అభివృద్ధి చెందుతున్న నైపుణ్య అవసరాలు, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం వంటి కారణాలతో కంపెనీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దీంతో ఈ ఏడాది సగటు వేతన పెంపు 4-8.5 శాతం మధ్య ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**వేతన ఇంక్రిమెంట్లను ప్రభావితం చేసే అంశాలు**

గ్లోబల్ ఎకనామిక్ ఛాలెంజెస్: ఐటీ సేవల పరిశ్రమ ఆర్థిక అనిశ్చితితో సతమతమవుతోంది. ఇది విచక్షణ వ్యయం తగ్గడానికి, వ్యాపార ప్రాధాన్యతలను మార్చడానికి దారితీసింది. కంపెనీలు వేతన బడ్జెట్ల విషయంలో సంప్రదాయ పద్ధతిని అవలంబిస్తున్నాయి. కొన్ని సాంప్రదాయ ఏప్రిల్-జూన్ కాలానికి మించి అప్రైజల్ సైకిల్‌ను ఆలస్యం చేస్తున్నాయి. పెరుగుతున్న నైపుణ్య అవసరాలు: పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, నైపుణ్యాల ఆధారిత వేతనానికి ప్రాధాన్యత పెరుగుతోంది. సంస్థలు వ్యయాన్ని తగ్గించుకునేందుకు టైర్ 2 నియామకాలను ఉపయోగించుకుంటున్నాయి. మరోవైపు ప్రతిభావంతులను నిలుపునేందుకు నిలుపుదల బోనస్‌లు, ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్లు ప్రాజెక్ట్ ఆధారిత ప్రోత్సాహకాలను అమలు చేస్తున్నాయి. ఏఐ స్వీకరణ: పెరుగుతున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) స్వీకరణ శ్రామిక శక్తి నిర్మాణ వ్యవస్థలను పునర్నిర్మిస్తోంది. వేతన బడ్జెట్లను ప్రభావితం చేస్తోంది. ఏఐ ఆధారిత సామర్థ్యాలు, పెరుగుతున్న క్లయింట్ అవసరాలు మరింత జాగ్రత్తగా వనరులను కేటాయించడానికి కంపెనీలను ప్రేరేపిస్తున్నాయి.

**పరిశ్రమ నిపుణులు ఏమంటున్నారంటే..**

ఈ ఏడాది వేతనాల పెంపు చాలా జాగ్రత్తగా ఉందని టీమ్ లీజ్ డిజిటల్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ విజ్ పేర్కొన్నారు. '4-8.5 శాతం రేంజ్‌లో ఇంక్రిమెంట్లను ఇచ్చేందుకు పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. ఇది మునుపటి సంవత్సరాలతో పోలిస్తే తక్కువ. ప్రపంచ ఆర్థిక సవాళ్లు, మారుతున్న వ్యాపార ప్రాధాన్యాలు ఈ మందగమనానికి ప్రధాన కారణం' అని వివరించారు.

మరోవైపు 5-8.5 శాతం వేతన పెంపు ఉంటుందని రీడ్ అండ్ విల్లో సీఈఓ జానూ మోటియానీ అంచనా వేశారు. రెండంకెల పెరుగుదల రోజులు పోయినట్లు కనిపిస్తోందని ఆమె పేర్కొన్నారు. పరిశ్రమ మరింత ఆచరణాత్మక ధోరణి అవలంభిస్తున్నందున సగటు పెరుగుదల 5-8.5 శాతం మధ్య ఉంటుందని ఆమె భావిస్తున్నారు.

# కోహ్లీ 100 నాటౌట్....

స్పోర్ట్స్

దుబాయ్: ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. ఈ టార్గెట్‌ని టీమ్ఇండియా 42.3 ఓవర్లలో వికెట్లు 4 కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లీ (100బీ 111 బంతుల్లో 7 ఫోర్లు) బౌండరీ బాది శతకం పూర్తి చేసుకోవడంతో మ్యాచ్‌ను ముగించాడు. శ్రేయస్ అయ్యర్ (56బీ 67 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (46బీ 52 బంతుల్లో 7 ఫోర్లు) రాణించారు. రోహిత్ శర్మ (20బీ 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్, ఖుల్‌దిష్ షా ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో పాక్‌పై ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కావడం విశేషం. ఈ గెలుపుతో భారత్ దాదాపు సెమీస్ చేరగా.. పాక్ నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. ఐసీసీ మేజర్ ఈవెంట్లలో పాకిస్థాన్ పై తన ఆధిపత్యాన్ని భారత్ మరోసారి ఘనంగా చాటుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో నేడు జరిగిన లీగ్ మ్యాచ్ లో భారత్ చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లీ (100 నాటౌట్) అద్భుత సెంచరీ సాధించిన వేళ... టీమిండియా 6 వికెట్ల తేడాతో పాక్ ను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ సెమీస్ బెర్తును దాదాపు ఖాయం చేసుకుంది. దుబాయ్ లో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాక్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. టీమిండియా బౌలర్లు విజృంభించడంతో పాక్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం, 242 పరుగుల లక్ష్యఛేదనలో టీమిండియా సునాయాసంగా విజయాన్ని అందుకుంది. కేవలం 4 వికెట్లు కోల్పోయి 42.3 ఓవర్లలో 244 పరుగులు చేసింది.
టీమిండియా ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచిన కోహ్లీ 111 బంతుల్లో సరిగ్గా 100 పరుగులు చేశాడు. కోహ్లీ ఇన్నింగ్స్ లో 7 ఫోర్లు ఉన్నాయి. విన్నింగ్ షాట్ ఫోర్ కొట్టిన కోహ్లీ అటు సెంచరీ పూర్తి చేసుకోవడమే కాకుండా, ఇటు జట్టుకు విజయాన్ని అందించాడు. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కాగా, పాకిస్థాన్ పై నాలుగోది. అంతకుముందు, కెప్టెన్ రోహిత్ శర్మ 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ తో 20 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ శుభ్ మన్ గిల్ 46, శ్రేయాస్ అయ్యర్ 56 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా 8 పరుగులకే వెనుదిరిగినా... అక్షర్ పటేల్ (3 నాటౌట్) తో కలిసి కోహ్లీ మిగతా పని పూర్తి చేశాడు. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్ 1, కుష్ దిల్ షా 1 వికెట్ తీశారు. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశలో టీమిండియాకు ఇది వరుసగా రెండో విజయం కాగా... పాకిస్థాన్ కు వరుసగా రెండో ఓటమి. ఈ ఓటమితో పాక్ సెమీస్ అవకాశాలు బాగా దెబ్బతిన్నాయి. గ్రూప్-ఏలో తాను ఆడిన రెండు మ్యాచ్ ల్లో విజయాలతో టీమిండియా టాప్ లో ఉంది. పాక్ అట్టడుగున ఉంది. రెండో స్థానంలో న్యూజిలాండ్, మూడో స్థానంలో బంగ్లాదేశ్ ఉన్నాయి. టీమిండియా తన చివరి లీగ్ మ్యాచ్ ను న్యూజిలాండ్ తో మార్చి 2న ఆడనుంది. పాక్ బ్యాటర్లలో సౌద్ షకీల్ (62బీ 76 బంతుల్లో 5 ఫోర్లు), మహ్మద్ రిజ్వాన్ (46బీ 77 బంతుల్లో 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ జోడీ మూడో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఓపెనర్లు ఇమామ్ ఉల్ హక్ (10), బాబర్ అజామ్ (23) పరుగులు చేశారు. సల్మాన్ అఘా (19), ఖుష్‌దిల్ షా (38) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, హార్దిక్ పాండ్య 2, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా తలో వికెట్ పడగొట్టారు.



విరాట్ సూపర్ సెంచరీ..

భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీతో మెరిశాడు. రోహిత్ శర్మ ఔటయ్యాక క్రీజులోకి విరాట్.. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలుత శుబ్‌మన్ గిల్‌తో కలిసి విలువైన పార్టనర్‌షిప్ నెలకొల్పిన కోహ్లీ.. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్‌తో కలిసి మ్యాచ్ విన్నింగ్ భాగస్వామ్యం నమోదు చేశాడు.
ఈ క్రమంలో 111 బంతుల్లో తన 51వ వన్డే సెంచరీ మార్క్‌ను కింగ్ కోహ్లీ అందుకున్నాడు. కోహ్లీ 111 బంతుల్లో 7 ఫోర్లతో సరిగ్గా 100 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కోహ్లీకి ఇది 82వ అంతర్జాతీయ సెంచరీ కావడం విశేషం. ఇక కోహ్లీతో పాటు శ్రేయస్ అయ్యర్(67 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 56), శుబ్‌మన్ గిల్(46) పరుగులతో రాణించారు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టగా.. ఆర్బర్ ఆహ్మద్, కుష్దిల్ షా తలా రెండు వికెట్లు వికెట్ సాధించారు.

చెలరేగిన భారత బౌలర్లు..


అంతకముందు బ్యాటింగ్? చేసిన పాకిస్తాన్ పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది.

## పాక్‌తో మ్యాచ్‌లో మైదానాన్ని వీడిన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ..! ఆందోళనకు గురైన అభిమానులు..!



దుబాయి వేదికగా భారత్-పాక్ మధ్య హై వోల్టేజ్ మ్యాచ్ జరుగుతున్నది. మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ రిజ్వాన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బాబర్ ఆజం, ఇమామ్ ఉల్ హక్ క్రీజులో ఉండగా.. టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ బౌలింగ్‌ను ప్రారంభించాడు. తొలి ఓవర్‌లో షమీ ఐదు వైడ్స్ వేశాడు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్లనే షమీ పదకొండు బంతులు విసిరాడు. బౌలింగ్ సమయంలో షమీ పూర్తి లయలో కనిపించలేదు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్ సమయంలో మైదానాన్ని వీడాడు. దాంతో టీమిండియా ఫ్యాన్స్ షాక్‌కు గురయ్యారు. షమీకి మళ్లీ ఏమైనా గాయమైందా? అంటూ ఆరా తీశారు. అయితే, ఇప్పటికే టీమిండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా సైతం చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. పాక్‌తో మ్యాచ్‌లో షమీ సైతం మధ్యలోనే మైదానాన్ని వీడడంతో టీమిండియా అభిమానులు కలవరానికి గురయ్యారు. మళ్లీ పాక్ ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత మైదానంలోకి రాగా.. ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత 12వ ఓవర్‌లో బౌలింగ్‌కి వచ్చాడు. వాస్తవానికి, ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో షమీ బౌలింగ్ చేసేందుకు వచ్చాడు. అతనికి అది మూడో ఓవర్. నాల్గో బంతి తర్వాత.. కాస్త ఇబ్బంది పడుతూ కనిపించగా.. ఫిజియో మైదానంలోకి వచ్చాడు. ఆ ఓవర్‌లో బౌలింగ్ బాగానే చేసినా.. రన్ అప్‌లో ఇబ్బందిపడ్డాడు. దాంతో ఫిజియోకి చూపించాల్సిన అవసరం ఉందని భావించాడు. గతకొంత కాలంగా చీలమండ సమస్యతో సమీ బాధపడుతున్నారు. ఆ ఓవర్‌లో మరో రెండు బంతులు వేసి మైదానం నుంచి బయటకు వెళ్లిపోయాడు. మళ్లీ 12 ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చాడు. ఆ సమయంలో పూర్తి లయతో బౌలింగ్ చేసిన షమీ.. ఆ ఓవర్‌లో కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చాడు. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత గాయంతో షమీ టీమిండియాకు దూరమయ్యాడు. ఆ తర్వాత షమీకి సర్జరీ జరిగింది. దాదాపు 14 నెలల పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న షమీ.. కోలుకొని ఇంగ్లాండ్‌తో సిరీస్ సందర్భంగా టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. పాక్‌తో మ్యాచ్‌లో తన తొలి స్పెల్‌లో గంటకు 135 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరాడు. 2024లో బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్‌పై తినాషే పన్యాంగర ఏడు వైడ్‌లు వేయగా.. చాంపియన్స్ ట్రోఫీలో పాక్‌తో మ్యాచ్‌లో మహ్మద్ షమీ తొలి ఓవర్‌లోనే ఐదు వైడ్‌లు వేశాడు. తొలి స్పెల్‌లో షమీ సగటు వేగం 131.7 కిలోమీటర్ల వేగంతో బంతులు వేసిన షమీకి.. 2015 తర్వాత వన్డేల్లో ఓపెనింగ్ స్పెల్‌లో అత్యల్ప వేగంతో బంతులు విసరడం ఇదే తొలిసారి.





# త్రిషతోనే కాదు ఆమె కుమార్తెతోనూ సినిమా స్కూల్‌కు వెళ్తా

సినిమా అనే స్కూల్‌కు హీరోయిన్ త్రిషతోనే కాదని, ఆమె కుమార్తెతో కూడా కలిసి వెళ్తానని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అన్నారు. చెన్నైలో తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో కమల్ హాసన్, త్రిష పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'థగ్‌లైఫ్' మూవీలో కమల్‌తో కలిసి నటించిన అనుభవంపై త్రిష స్పందిస్తూ.. 'థగ్‌లైఫ్' చిత్రంలో నటించడం గొప్ప అనుభవంగా భావిస్తున్నా అన్నారు. కమల్ హాసన్ వద్ద అనేక విషయాలు నేర్చుకున్నానని, ఆయనతో కలిసి ఒక పాఠశాలకు వెళ్ళిన అనుభూతిని పొందానని త్రిష చెప్పారు. ఆ స్కూల్‌లో అనేక విషయాలు తెలుసుకున్నాని తెలిపారు. ఈ సందర్భంగా కమల్ స్పందిస్తూ.. 'నిజమే.. నేను త్రిషతో కలిసి స్కూల్‌కు వెళ్ళాను. అక్కడ అనేక విషయాలు నేర్చుకున్నాం. గురుస్థానం అనేది నాకొద్దు. అది దివంగత కే బాలచందర్‌తోనే ఉండిపోనివ్వండి' అన్నారు. తాను ఎల్లవేళలా ఒక విద్యార్థిగానే ఉండేందుకు ఇష్టపడతానని, త్రిషతో కలిసి స్కూలుకు వెళ్ళా నని కమల్ చెప్పారు. ఆ తరువాత ఆమె కుమార్తెతో కూడా పాఠశాలకు వెళతానని అన్నారు. సినిమా అనేది చాలా పెద్దదని, తాను 5వ తరగతి వరకు మాత్రమే నేర్పించగలనని వ్యాఖ్యానించారు. పీహెచ్‌డీ స్థాయికి నేను నేర్పించలేనని, ఆ స్థాయిలో నేను నేర్చుకోలేదని అన్నారు. సినిమా అనేది అనేక విషయాల సమ్మేళనమని పేర్కొన్నారు.

# 'మజాకా' ట్రైలర్‌లో పీపుల్స్ స్టార్.. తప్పు సరిచేసుకున్న సందీప్

త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో సందీప్ కిషన్ రీతూ వర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'మజాకా'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శివరాత్రి కానుకగా ఈ నెల 26న విడుదల కానుంది. అయితే, తాజాగా ఈ చిత్రం నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. నేను లోకల్,హలో గురు ప్రేమకోసమే,సినిమా చూపిస్త మావ ,ధమాకా వంటి సినిమాలతో దర్శకుడిగా త్రినాథరావుకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ఆయన నుంచి మజాకా మూవీ వస్తుండటంతో ప్రేక్షకులలో మంచి అంచనాలే ఉన్నాయి. తాజాగా విడుదలైన మజాకా ట్రైలర్ టైటిల్ కార్డ్‌లో హీరో సందీప్ కిషన్‌కు 'పీపుల్స్ స్టార్' అనే ట్యాగ్‌లైన్ చేర్చారు. పీపుల్స్ స్టార్ అంటే ఎవరికైనా వెంటనే గుర్తుకొచ్చే పేరు ఆర్. నారాయణమూర్తి అని తెలిసిందే. దీంతో ఈ విషయంపై పలు అభ్యంతరాలు రావడంతో ఆయన వెంటనే స్పందించారు. ఆర్ . నారాయణమూర్తికి పీపుల్స్ స్టార్ ట్యాగ్ లైన్ ఉన్న విషయం తనకు తెలియదని సందీప్ కిషన్ వివరణ ఇచ్చారు. తనకు ట్యాగ్ లైన్స్‌తో ఎలాంటి పనిలేదన్నారు. వాటిని పెద్దగా పట్టించుకోనని తెలిపారు. అయితే, నారాయమూర్తి సినిమాలు చాలా బాగుంటాయని, ఆయనకు తాను కూడా అభిమానినని పేర్కొన్నారు. మజాకా సినిమా కోసం పీపుల్స్ స్టార్ అనే ట్యాగ్ లైన్‌ను తాను పెట్టుకోలేదు. నిర్మాత అనిల్ సుంకర పెట్టారని సందీప్ కిషన్ వివరణ ఇచ్చారు. మజాకా చిత్రంలో సందీప్ కిషన్ – రావు రమేశ్ తండ్రీ తనయుల పాత్రల్లో సందడి చేయనున్నారు. తనయుడు ఒక అమ్మాయితో.. తండ్రి మరో అమ్మాయితో ప్రేమలో పడటం.. సరదాగా సాగే జీవితాల్లో వారికి వచ్చిన సమస్య ఏమిటి? దానిని వారెలా అధిగమించారు? అనే అంశాలతో ఈ సినిమా రూపొందుకున్నట్లు తెలుస్తోంది.






# సమ్మర్ కే జాతకం చెబుతానంటున్న సారంగపాణి

శ్రీదేవి మూవీస్ పతాకంపై సీనియర్ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం' మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో ప్రియదర్శి రూప కొడవాయూర్ జంటగా నటించారు. ఇప్పటికే ఈ సినిమాను విడుదలైన టైటిల్ సాంగ్ 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' ట్రెండ్ అవుతున్నాయి. అలానే టీజర్ కు మంచి స్పందన లభిస్తోంది. 'జెంటిల్ మన్, సమ్మోహనం' చిత్రాల దర్వాత శ్రీదేవి మూవీస్ బ్యానర్ లో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కిస్తున్న మూడో చిత్రమిది. ఈ సినిమాను వేసవి కానుకగా విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ తాజాగా తెలిపారు. సినిమా చిత్రీకరణ పూర్తయ్యిందని, డబ్బింగ్ తో పాటు ఇతర పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ సైతం తుదిదశకు చేరుకుందని తెలిపారు. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు ఈ సినిమా జవాబు ఇస్తుందని, ఇంటిల్లిపాదిని కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలు ఇందులో ఉంటాయని మోహనకృష్ణ ఇంద్రగంటి తెలిపారు. వివేక్ సాగర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.



### ఆ స్టార్ హీరోతో 20 నిమిషాల సీన్..

# డెబ్బక్ కెరీర్ మారిపోయింది

యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ లో చిన్న చిన్న సినిమాల్లో కథానాయికగా నటించి మెప్పించింది. ఇండస్ట్రీలోకి వచ్చిన పదేళ్లకు హీరోయిన్ గా సరైన బ్రేక్ సొంతం చేసుకుంది. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ తో కలిసి చేసిన ఓ 20 నిమిషాల సీన్ ఆమె కెరీర్ ను మలుపు తిప్పింది. దీంతో పాన్ ఇండియా లెవల్లో ఆమె పేరు మారుమోగింది. ప్రస్తుతం ఆమె బీటౌన్ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ త్రిప్తి డిమ్రీ. 2023లో విడుదలైన యానిమల్ సినిమాతో ఈ ఈ బ్యూటీ క్రేజ్ మారిపోయింది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్ చిత్రంలో రణబీర్ కపూర్, రష్మిక మందన్నా జంటగా నటించిన సంగతి తెలిసిందే. పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ రూ.900 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సినిమాలో రణబీర్, త్రిప్తి డిమ్రీ మధ్య వచ్చే సీన్ ఎంత సంచలనం సృష్టించిందో చెప్పక్కర్లేదు. దీంతో ఆమె పేరు మారుమోగింది. ఈరోజు త్రిప్తి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సినీ తారలు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఒక చిన్న గ్రామానికి చెందిన తృప్తి ఢిల్లీలో చదువుకుంది. చిన్నప్పటి నుంచి ఆమెకు యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. తృప్తి యూట్యూబ్ సృష్టికర్త అని, 'విప్రా డైలాగ్స్' ఛానెల్‌లో పలు ప్రకటనలలో నటించింది. యూట్యూబ్‌లో తన అనుభవాల తర్వాత, ఆమె మోడలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఆమె 'యానిమల్' చిత్రంలో బాబీ డియోల్ సోదరుడిగా నటించిన సౌరభ్ సచ్‌దేవా నుండి నటన పాఠాలు నేర్చుకుంది. ఆమె 2017 లో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. సన్నీ డియోల్, బాబీ డియోల్ చిత్రం 'పోస్టర్ బాయ్స్' చిత్రంతో గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత లైలా మజ్ను, బుల్బుల్, కాలా చిత్రాలతో మరింత ఫేమస్ అయ్యింది. యానిమల్ సినిమా ఆమె కెరీర్ మలుపు తిప్పింది. ఇటీవలే భూల్ భూలయ్యా 3 చిత్రంలో నటించింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com